ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



1 నంద్యాల
జిల్లా వార్తలు
శుక్రవారం 26 ఏప్రిల్ 2024



పూర్తికాని గోరుకల్లు రిజర్వాయర్ నిర్మాణం

- మూత పడిన పరిశ్రమలు
- పూర్తికాని గోరుకల్లు రిజర్వాయర్
- గ్రామాలలో మౌలిక సదుపాయాలు కరువు
- రైతాంగ సమస్యలు పట్టించుకోని ప్రజా ప్రతినిధులు
- విచ్చలవిడి అక్రమ తవ్వకాలు

పాణ్యంలో అభివృద్ధి శూన్యం

పాణ్యం, ఏప్రిల్ 25 :

పాణ్యం ఎవ్వరికీ పట్టలేదు. అన్ని రంగాల్లో ఐదేళ్లుగా వెనుకబడిపోయింది. వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి రైతాంగ, కార్మిక, యువజన రంగాలు కుదేలయ్యాయి. ప్రకృతి సంపద, ఆర్థిక వనరులు ఉన్నా వాటిని వినియోగించి ప్రజల అభివృద్ధిని సాధించాలనే ఉద్దేశం పాలకులకు లేదు. దీంతో పాణ్యం నియోజకవర్గం అన్నిటా వెనుకబడిపోయింది. మండలంలో 19 గ్రామ పంచాయతీలున్నాయి. గ్రామాలలో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉంది. జాతీయ రహదారులు, రైల్వే రవాణా అవకాశాలున్నా నర్సరీల అభివృద్ధి నీరుగారిపోతోంది. గత ఐదేళ్లలో ప్రభుత్వం గ్రామాలలోని ఏ సమస్యపైనా దృష్టి సారించలేదు.

అందుబాటులో నీరున్నా ఉపయోగించుకోలేని దుస్థితి

వర్షాధార ప్రాంతాలైన కందికాయపల్లె, తమ్మరాజుపల్లె, పిన్నాపురం గ్రామాల రైతులు వర్షాధారంపైనే ఆధారపడుతున్నారు. 2005లో పిన్నా పురం, తమ్మరాజుపల్లె గ్రామాలకు తాగు, సాగునీరు అందించడానికి గోరుకల్లు నుంచి ఎత్తిపోతల పథకాన్ని చేపడతామన్న హామీలు గాలికొదిలేశారు. ఇప్పటికే గోరుకల్లు రిజర్వాయర్ నుంచి బనగానపల్లె మండలంలోని జయజ్యోతి, డోన్ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు తాగునీరు, పిన్నాపురంలోని .జల విద్యుత్‌ప్లాంటుకు మూడు టీఎంసీల నీరు కేటాయించారు. మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న నీటిని వర్షాధారిత ప్రాంతాలకు నీరందించడంలో ప్రభుత్వం విఫలమైంది.

ఏటిపాయతో వేలాది ఎకరాలకు సాగు నీరు

తమ్మరాజుపల్లె గద్దలకొండ సమీపంలోని ఏటిపాయ చెక్‌డ్యాం నిర్మాణంతో తమ్మరాజుపల్లె, పాణ్యం, సుగాలిమెట్ట తదితర ప్రాంతాలలోని వ్యవసాయానికి, తాగునీటి అవసరాలకు నీరు అందించే అవకాశం ఉంది. కానీ అధికారులు పట్టించుకోకపోవడంతో వర్షం వస్తేనే ఈ గ్రామాల్లో పంటలు పండించుకుంటున్నారు. మండలంలోని తమ్మరాజుపల్లె ఏటిపాయ వాగుపై 1992లో చెక్‌డ్యాం నిర్మించారు. అప్పటి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి వి. రాంభూపాల్ చౌదరి డ్యాంను ప్రారంభించారు. 1996లో వరదల వల్ల డ్యాం పూర్తిగా దెబ్బతినింది. పునర్నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం ప్రతియేటా ప్రతిపాదనలు పంపిస్తున్నారు. నిధులు కేటాయిస్తున్నారు. కానీ పనులు జరగడం లేదు. ఎన్నికల్లో ఈ డ్యాం నిర్మాణాన్ని చేపడతామని నాయకులు హామీలివ్వడమే తప్ప ఫలితం కనిపించడం లేదు. ఏటిపాయ చెక్‌డ్యాం సక్రమంగా పని చేస్తే దాదాపు 3 వేల ఎకరాల మెట్ట భూములకు పుష్కలంగా సాగునీరందుతుంది. దీని కోసం ప్రతిపాదనలన్నీ చెత్తబుట్టదాఖలయ్యాయి. దీంతో సాగు, తాగు నీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. రైతులు పశువులు అమ్మేసుకుంటున్నారు.



పూర్తికాని ఏటిపాయ పర్క్యులేషన్ ట్యాంకు



అక్రమంగా తవ్విన కొండలు

ప్రభుత్వ భూములకు అందని పరిహారం

పిన్నాపురం సమీపంలో గ్రీన్‌కో చేపట్టిన సోలార్, పవన, జల విద్యుత్ నిర్మాణానికి భూమి సేకరించారు. కానీ రైతులకు పరిహారం ఇవ్వలేదు. నష్టపరిహారం పంపిణీలో రాజకీయ జోక్యంతో రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు తెలుస్తోంది. ఈ వివాదంలో కోట్లాది రూపాయలు కాజేసినట్లు వైసీపీ నాయకులపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ్మరాజుపల్లె పిన్నాపురం గ్రామాల పరిధిలోని ప్రభుత్వ భూములను నియోజకవర్గ ప్రతినిధి అండతో స్థానిక రెవెన్యూ అధికారులు మ్యూటేషన్ చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీ పట్టా భూములను పట్టా భూములుగా మార్చి అమ్ముకున్నట్లు తెలుస్తోంది. రైతుల భూములకు పరిహారం ఇవ్వకుండా దౌర్జన్యంగా సోలార్‌కు అప్పజెప్పినట్లు తెలుస్తోంది.

విచ్చలవిడిగా కొండల అక్రమ తవ్వకాలు

తమ్మరాజుపల్లె, సుగాలిమెట్ట ప్రాంతాల కొండలను అక్రమంగా తవ్వి మట్టిని తరలిస్తున్నా అధికారులు నోరు మెదపడంలేదు. మండలంలోని కొందరు వైసీపీ అక్రమార్కులు విచ్చలవిడిగా కొండలను తవ్వి నంద్యాల, బనగానపల్లె తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రతి రోజూ వందలాది టిప్పర్లతో మట్టి తరలిస్తున్నారు. సుగాలిమెట్ల సమీపంలోని వన్యప్రాణుల, పాడిపశువుల పశుగ్రాసం కోసం కేటాయించిన బఫర్ జోన్ ప్రాంతంలోని మట్టిని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేరు చెప్పుకుంటూ కొందరు అమ్ముకుంటున్నారు. సుగాలిమెట్ట వాసుల జీవనాధారమైన ఈ బఫర్ జోన్‌లో పశువులకు మేత లేకుండా చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ముందుకు సాగని గోరుకల్లు రిజర్వాయర్ నిర్మాణ పనులు

1.94 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంతో 2005లో గోరుకల్లు రిజర్వాయర్ పనులు ప్రారంభించారు. ఇప్పటికీ ఇది పూర్తి కాలేదు. రూ. 99 కోట్లతో పూర్తయ్యే నిర్మాణానికి నిధులు కేటాయించలేదు. దీంతో నిర్మాణమైన భాగాలు యేడాదికేడాది శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఇటీవల మట్టికట్ట రెండు చోట్ల కుంగిపోయింది. రాతి పరుపు వంద మీటర్ల మేర కుంగి మట్టి కట్టకు ప్రమాదమేర్పడింది. కుంగిన రాతిపరుపు పునర్నిర్మాణానికి రూ 1.70 కోట్లతో పనులు చేపట్టారు. దీని కోసం రిజర్వాయర్‌లోని రెండు టీఎంసీల నీటిని కిందికి వృథాగా వదిలివేశారు. పనులు నాణ్యంగా చేయకపోవడంతో మళ్లీ ఔట్‌పాల్ రెగ్యులేటర్ వద్ద రాతిపరుపు కుంగిపోయింది. రైతులతోపాటు సమీపంలోని గోరుకల్లు ప్రజలు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మొదట చేసిన పనులకే నిధులు రాకపోవడంతో ఇప్పుడు కుంగిన రాతిపరుపు పనుల రిపేరీలకు గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో వచ్చే రబీలో రిజర్వాయర్‌లో నీరు నిల్వ చేయడంపై రైతాంగం అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గోరుకల్లు నిర్మాణం తన కృషేనని చెప్పుకుంటున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఇరవై యేళ్లుగా ఎందుకు పూర్తి చేయలేదని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఏడేళ్లుగా మరుగుదొడ్డిలేని బస్టాండు : వైసీపీ కార్యాలయం సమీపంలోని బస్టాండు వద్ద ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఎమ్మెల్యేకు కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి. టీడీపీ హయాంలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండును నాలుగురోడ్ల నిర్మాణంతో కూల్చివేశారు. కూల్చివేసిన చోట చిన్న బస్ షెల్టర్‌ను నిర్మించిన హైవే అధికారులు ప్రయాణికులకు మరుగుదొడ్డి, తాగునీరు సౌకర్యం కల్పించలేదు. పలు మార్లు ప్రజాసంఘాలు దీనిపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినా ఆయన పట్టించుకోలేదు.

అక్రమణలో దళితుల శ్మశానాలు : టీడీపీ హయాంలో పాణ్యం, కౌలూరు, నెరవాడ తదితర గ్రామాలలో శ్మశానాల అభివృద్ధికి దాదాపు కోటి రూపాయలు ఖర్చు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో శ్మశానాలలో కంపచెట్లు సైతం తొలగించలేదు. ఆలమూరు, బలపనూరు, గోనవరం, కొత్తూరు, గగ్గటూరు తదితర గ్రామాలలో శ్మశానాలు అధ్వానంగా తయారయ్యాయి.

న్యాయాధికారుల బదిలీ

కర్నూలు(లీగల్), ఏప్రిల్ 25: ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలువురు జూనియర్ సివిల్ న్యాయాధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలులో ఖాళీగా ఉన్న ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్‌గా విజయనగరం జిల్లా బొబ్బిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారిగా పని చేస్తున్న ఎం.సరోజమ్మను బదిలీ చేశారు. బనగానపల్లె జూనియర్ సివిల్ న్యాయాధికారిగా పని చేస్తున్న కిషోర్ కుమార్‌ను ప్రకాశం జిల్లా మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారిగా బదిలీ చేశారు. డోన్ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న పి.హనీషాను పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా బదిలీ చేశారు. ఈ స్థానంలో చిత్తూరు జిల్లా పీలేరు జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న సాకే జ్యోతిని నియమించారు. ఖాళీగా ఉన్న నందికొట్కూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి స్థానంలోకి పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి వి. దివ్యను బదిలీ చేశారు. ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న గురు అరవింద్‌ను చిత్తూరు జిల్లా వాయల్పాడు కోర్టుకు బదిలీ చేశారు. ఖాళీగా ఉన్న ఆదోని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో పని చేస్తున్న లీలాసాయి సుభాష్‌ను నియమించారు. నంద్యాల అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న జి. అర్చనను ఖాళీగా ఉన్న ఆదోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. బదిలీలు అయిన ఈ న్యాయాధికారులందరూ మే నెల 3వ తేదీలోగా బాధ్యతలు స్వీకరించాలని రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులో పేర్కొంది.

ఉల్లంఘనల సమాచారం ఇవ్వండి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల అభ్యర్థులు ఎన్నికల సాధారణ పరిశీలకులకు ఫిర్యాదులు కానీ, సమాచారం కానీ ఇవ్వచ్చునని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు గురువారం ప్రకటనలో తెలిపారు. నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గం, శ్రీశైలం, నందికొట్కూరు, పాణ్యం, డోన్ అసెంబ్లీ నియోజవర్గాల సాధారణ పరిశీలకుడు పంకజ్‌కుమార్ తెలియజేయడానికి 08514-293917కు ఫోన్ చేయవచ్చునన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆళ్లగడ్డ, నంద్యాల, బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకుడు దినేష్‌కుమార్‌కు తెలియజేయడానికి ల్యాండ్ లైన్ 08514-293910కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చునన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం పోలీసు పరిశీలకులు హిమాంశు శంకర్ త్రివేది ల్యాండ్ లైన్ నెంబరు 08514-293913 ఫోన్ చేసి సమాచారం అందించవచ్చునన్నారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 25: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్ 2024 అర్హత ప్రవేశ పరీక్ష ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా పాలిటెక్నిక్ కోఆర్డినేటర్ శ్రీనివాస ప్రసాద్ గురువారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 18 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 5,460 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని మౌలిక వసతులు సిద్ధం చేశారన్నారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు గంట ముందు చేరుకోవాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా తగిన నీటి సౌకర్యం, ప్రథమ చికిత్స, ఓఆర్‌ఎస్‌లను అందుబాటులో ఉంచుతామని అన్నారు.

వెల్దుర్తిలో ఆగిన 'వందే భారత్'

సిగ్నలింగ్ వ్యవస్థలో లోపం

వెల్దుర్తి, ఏప్రిల్, 25: హైదరాబాదు నుంచి బెంగళూరు వెళ్తున్న వందే భారత్ రైలు గురువారం వెల్దుర్తి రైల్వేస్టేషన్‌లో సుమారు 15 నిమిషాల పాటు నిలిచింది. అదేసమయంలో (వందే భారత్ రైలు వస్తుందని) నంద్యాల నుంచి కర్నూలు వెళ్తున్న డెమోను ముందస్తుగా బోగీలు రైల్వేస్టేషన్‌లో అరగంటసేపు పాటు నిలిపారు. గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఏపీఆర్‌ఎస్ క్యాట్ పరీక్షలకు కర్నూలుకు సమయానికి చేరుకోలేమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళ చెందారు. సిగ్నలింగ్ వ్యవస్థ లోపం కారణంగా వందే భారత్ రైలు ఆగినట్లు రైల్వే వర్గాల సమాచారం.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

నంద్యాల క్రైం, ఏప్రిల్ 25 : నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు, స్ట్రాంగ్ రూమ్‌లను ఎన్నికల ప్రత్యేక పోలీసు పరిశీలనాధికారి హిమాంశ్ శంకర్ త్రివేది, కర్నూలు రేంజ్ డీఐజీ సి.హెచ్.విజయరావు, నంద్యాల ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డిలతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ ఆకస్మిక తనిఖీలో స్థానిక పరిస్థితులపై పోలీసు అధికారులతో హిమాంశ్ శంకర్ త్రివేది చర్చించారు. అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు, ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిలతో చర్చిస్తున్న హిమాంశ్ శంకర్ త్రివేది

నేడు భ్రామరికి కుంభోత్సవం

శ్రీశైలం, ఏప్రిల్ 25: శ్రీశైలం మహాక్షేత్రంలో శుక్రవారం భ్రమరాంబికాదేవికి వార్షిక కుంభోత్సవం కార్యక్రమాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించనుంది. కుంభోత్సవ ఏర్పాట్లను దేవస్థానం ఇప్పటికే పూర్తి చేసింది. శుక్రవారం ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవ కార్యక్రమాలు సంపూర్ణంగా జరిపించాలన్నారు. అదేవిధంగా దేవదాయ చట్టం ప్రకారం క్షేత్ర పరిధిలో జంతు, పక్షి బలులను పూర్తిగా నిషేధించామని, ఈ ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కుంభోత్సవం తర్వాత అమ్మవారి దర్శనం క్యూలైన్లలో తొక్కిసలాట జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని దేవస్థానం భద్రతా విభాగపు పర్యవేక్షకులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. ప్రసాదరావు, ఎస్సై గంగయ్య యాదవ్, డిప్యూటీ కార్యనిర్వహణాధికారి రవణమ్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వి. రామకృష్ణ, మురళీధర్‌రెడ్డి, ఏఈవోలు మోహన్, హరిదాసు, మల్లికార్జునరెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.



కుంభోత్సవ ఏర్పాట్ల సమీక్షలో ఈవో, అధికారులు

ముగిసిన నామినేషన్ల ఘట్టం

● ఆఖరి రోజు 145 నామినేషన్లు ● మొత్తం 309

నంద్యాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నామినేషన్ ఘట్టానికి గురువారం తెరపడింది. చివరి రోజున 145 మంది నామినేషన్లు దాఖలు చేశారు. నంద్యాల పార్లమెంటు నియోజకవర్గానికి 32 మంది, జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు 113 మంది నామినేషన్ పత్రాలను సమర్పించారు. నంద్యాల పార్లమెంటుకు టీడీపీ నుంచి బైరెడ్డి శబరి, బైరెడ్డి రాజశేఖరరెడ్డి (రెండు సెట్లు)తోపాటు మరో 30 మంది నామినేషన్లు వేశారు. ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గానికి 12 మంది, శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గానికి 15 మంది, నందికొట్కూరు నియోజకవర్గానికి 20 మంది, బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి 17 మంది, డోన్ అసెంబ్లీ నియోజకవర్గానికి 12 మంది, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి 29 మంది తమ నామినేషన్లను సమర్పించారు. తొలిరోజు 9 నామినేషన్లు, రెండో రోజు 6 నామినేషను, మూడో రోజు 11 నామినేషన్లు, నాలుగో రోజు 25 నామినేషన్లు, ఐదో రోజు 39 నామినేషన్లు, ఆరో రోజు 74 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజైన ఏడో రోజు ఏకంగా 145 నామినేషన్లు వచ్చాయి. వెరసి 309 నామినేషన్లు దాఖలు అయ్యాయి. నామినేషన్ల పర్వం పూర్తి కావడంతో నేటి నుంచి నామినేషన్ల పరిశీలన మొదలవుతుంది. వివరాలు సరిగా లేని నామినేషన్‌ను తిరస్కరిస్తారు. ఇప్పటి వరకు ఒక్కొక్క అభ్యర్థి పలుమార్లు నామినేషన్లు వేయగా, ఇక కొంతమంది అభ్యర్థుల తరఫున డమ్మీ నామినేషన్లు వేశారు. ఈ లెక్కన చివరి రోజు వరకు నామినేషన్ పత్రాలు 309 వచ్చినా, అభ్యర్థుల సంఖ్య తక్కువగానే ఉండే అవకాశం ఉంది. ఇక నామినేషన్ల వడపోతలో నంద్యాల పార్లమెంటు నియోజకవర్గానికి ఎంత మంది బరిలో ఉన్నారు? జిల్లాలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఎంత మంది అభ్యర్థులు ఎన్నికల పోటీలో ఉన్నారు? అనే విషయం తెలియనుంది.



బైరెడ్డి శబరి తరపున నామినేషన్ పత్రాలను జిల్లా ఎన్నికల అధికారికి అందజేస్తున్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

నకిలీ విత్తనాలతో రైతులకు మోసం

ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిపై బైరెడ్డి శబరి ఆగ్రహం

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 25: ఆస్తుల పెంపు కోసం నకిలీ విత్తనాలతో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి రైతులను నిలువునా మోసం చేశాడని టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నంద్యాలలోని టీడీపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డితో కలిసి ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయలసీమ అభ్యున్నతి కోసం తన తండ్రి బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి రాజీలేని పోరాటం చేస్తున్నారన్నారు. ఐదేళ్లుగా ఎంపీగా ఉన్న పోచా బ్రహ్మానందరెడ్డి చేసిందేమిటో ప్రజలకు చెప్పాలన్నారు. సిగ్గులేకుండా మళ్లీ ఓట్లు అడిగేందుకు ప్రజల ముందుకు రావడం ఏమిటన్నారు. బైరెడ్డి కుటుంబంపై విమర్శలు చేసే హక్కు పోచా బ్రహ్మానందరెడ్డికి లేదన్నారు. అభివృద్ధి, సంక్షేమం రాష్ట్రానికి రెండు కళ్ల లాంటివని, అవి టీడీపీతోనే సాధ్యమని పేర్కొన్నారు.




మాట్లాడుతున్న బైరెడ్డి శబరి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

'నాసిరకం విత్తన ముఠా నేత పోచా'

వైసీపీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి నాసిరకం విత్తనాల ముఠా నాయకుడని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రైతుల జీవితాలతో ఆడుకున్న ఆయనదీ ఒక బతుకేనా అని ధ్వజమెత్తారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పోచా బ్రహ్మానందరెడ్డి నాసిరకం విత్తనాలు రైతులకు విక్రయిస్తే.. రైతుల పక్షాన నిలబడి వారికి న్యాయం చేశానని బైరెడ్డి అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయించలేని అసమర్థ ఎంపీగా బ్రహ్మానందరెడ్డి చరిత్రలో నిలిచిపోయాడన్నారు.

ఆళ్లగడ్డపై శోభా నాగిరెడ్డి మార్క్

తొలి మహిళా ఎమ్మెల్యే



ఆళ్లగడ్డ, ఏప్రిల్ 25: రాష్ట్ర రాజకీయాల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గానికి ఎప్పటికీ ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. కుటుంబ, ఫ్యాక్షన్ రాజకీయాల మధ్యే ఈ నియోజకవర్గంలో ఎన్నికలు జరుగుతుంటాయి. ఇంతటి పేరున్న ఆళ్లగడ్డ నియోజకవర్గంలో దివంగత శోభానాగిరెడ్డికి ప్రత్యేకత ఉంది. ఆళ్లగడ్డ నియోజకవర్గం నుంచి ఎన్నికైన తొలి మహిళా ఎమ్మెల్యేగా ఆమె చరిత్రలో నిలిచిపోయారు. 1997లో ఆళ్లగడ్డ అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన శోభా నాగిరెడ్డి.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇరిగెల రాంపుల్లారెడ్డిపై 37 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆ తరువాత 1999లో జరిగిన సాధారణ ఎన్నికల్లో సైతం టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల సమయంలో ఆమె రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు. అయితే అప్పటికే ఎన్నిక నిర్వహణ అనివార్యమైంది. దీంతో మృతి చెందిన తర్వాత కూడా ఆళ్లగడ్డ ప్రజలు శోభానాగిరెడ్డిని గెలిపించారు. అనంతరం ఆమె కుమార్తె భూమా అఖిలప్రియ ఏకగ్రీవంగా ఎన్నికై తండ్రి భూమా నాగిరెడ్డితో కలిసి అసెంబ్లీకి వెళ్లారు.

అప్పట్లో 21 ఏళ్లకు ఓటు హక్కు..!

మీకు తెలుసా



బనగానపల్లె/శిరివెళ్ల, ఏప్రిల్ 25: కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణలో ఏడు దశాబ్దాల కాలంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. భారతదేశంలో మొదట సాధారణ ఎన్నికలు 1952లో ఎన్నికల కమిషనర్‌లో సుకుమార్‌సైన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలి భారతదేశ ఎన్నికల్లో 17.90 కోట్ల ఓటర్లకు ఓటువేసే అవకాశం కల్పించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 1985 వరకు ఓటు హక్కు కనీస వయస్సు 21 సంవత్సరాలుగా ఉండేది. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యాక 1988లో 61వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఓటుహక్కు వయస్సును 18 ఏళ్లకు తగ్గించారు. ఎన్నికల నిర్వహణలో సమూల సంస్కరణలు అమలు చేసిన ఘనత 1990లో ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన టీఎన్ శేషన్‌కు దక్కుతుంది. 1952లో జరిగిన భారతదేశ మొదటి సాధారణ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 55 పార్టీలు బరిలో నిలవగా 2014నాటికి ఆసంఖ్య 370కి చేరింది. ఎన్నికల నిర్వహణలో కేంద్ర ఎన్నికల సంఘం ఏడు దశాబ్దాల్లో అనేక సంస్కరణలు చేపట్టింది. బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించే విధానం నుంచి ప్రస్తుతం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం) వినియోగించే విధానాన్ని అమలు చేస్తున్నారు. 2019లో జరిగిన ఎన్నికల నుంచి ఓటు ఎవరికి వేసారో తెలుసుకునేందుకు ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్(వీవీ ప్యాట్) యంత్రాలను కూడా వినియోగిస్తున్నారు.

ఊదరగొడితే కేసుల మోత

బీ అలర్ట్




శిరివెళ్ల, ఏప్రిల్ 25: ఎన్నికల సందడి మొదలైందంటే చాలు... పట్టణాల్లో, గ్రామాల్లో మైకులు హోరెత్తుతుంటాయి. మీ ఓటు మాకే అంటూ పాటల రూపంలో, అనుకరణల మధ్య పార్టీల పేరుతో ఊదరగొట్టడం సర్వసాధారణం. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఓట్లు అభ్యర్థించేందుకు ఇంటింటికి తిరగడం, రోడ్ షోలు, సమావేశాలు నిర్వహిస్తుంటారు. పర్యావరణ చట్టాలు, నిబంధనలను అభ్యర్థులు, రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలి. ప్రచార సాధనాల మోత చెవుల్లో మార్మోగుతుంది. హద్దులు మీరిన శబ్దాలతో తలబొప్పి కడుతుంది. కొన్ని ప్రాంతాల్లో రాత్రి, పగలు తేడా లేకుండా డీజే శబ్దాలతో విపరీత ధోరణికి పోవడం సమస్యగా మారుతుంది. చట్టపరంగా ఏ మేరకు ధ్వని వినియోగించుకోవాలో ఎన్నికల సంఘం నిర్ణయించింది. శబ్దం పెరిగిందా.. కేసు నమోదు కావాల్సిందే. ప్రచారంలో పెద్ద పెద్ద స్పీకర్లు, డీజే బాక్సుల వినియోగం నిషేధం. ప్రచారంలో భాగంగా నివాస ప్రాంతాల్లో 45 నుంచి 55 డెసిబుల్స్ శబ్ద తీవ్రత, విద్యాలయాలు, న్యాయస్థానాలు, వైద్యశాలల సమీపంలో 40 నుంచి 50 డెసిబుల్స్, వ్యాపార ప్రాంతాల్లో 55 నుంచి 65 డెసిబుల్స్, పారిశ్రామిక ప్రాంతాల్లో 70 నుంచి 75 డెసిబుల్స్ శద్ధ తీవ్రతతో ప్రచారం నిర్వహించవచ్చు. ప్రచారంలో నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు శిక్షపడే అవకాశం ఉంది.

ఎన్నికలు ఖరీదు



కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 25: ఎన్నికలు అత్యంత ఖరీదుగా మారాయి. ఎన్నికల్లో పోటీకి నిలవాలంటే రూ.కోట్లు కుమ్మరించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, అసెంబ్లీ, పార్లమెంట్ ఇలా ఎన్నిక ఏదైనా సరే డబ్బులు విచ్చలవిడిగా పంచాల్సిందే. మద్యం, మనీ తప్పనిసరి అయ్యాయి. నోటు లేనిదే ఓటు రాదు అన్నట్టుగా పరిస్థితులు తయారయ్యాయి. సామాన్యులు సైతం రాజకీయాల్లో రాణించాలని ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తుంటే పోటీలో నిలబడే అభ్యర్థులకు ఆర్థిక స్తోమత ప్రధాన సమస్యగా మారుతోంది. గతంలో పోటీలో నిలబడే అభ్యర్థుల గుణ గణాలు, వారు చేసిన అభివృద్ధిని చూసి ఓట్లు వేసే ఓటర్లు, నేడు ఎవరు ధనికులైతే వారిదే గెలుపు అన్నవిధంగా పరిస్థితులు మారిపోయాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రూ.కోట్లు ఖర్చు పెట్టి సీటుపై కూర్చున్న నాయకుడు తిరిగి ఎలా సంపాదించాలా అన్న ఆలోచనతో పాలనసాగిస్తున్నాడు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఎన్నికల ఖర్చు ఇంకెంత వరకు వెళుతుందోనన్న ఆందోళన రాజకీయ వర్గాలు, మేధావుల్లో వ్యక్తమవుతోంది.

వైసీపీలో రివర్స్ గేర్





- మంత్రి బుగ్గనపై తిరుగుబాటు
- ప్రచారానికి దూరం
- ఆత్మీయ సమావేశాలతోనే సరి



ఆత్మీయ సమావేశంలో మంత్రి బుగ్గన (ఫైల్)

డోన్, ఏప్రిల్ 25: డోన్ నియోజకవర్గంలో కనుసైగలతో శాసించిన మంత్రి బుగ్గన ఎన్నికల వేళ దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తాను చెప్పిందే వేదం అన్నట్లు పాలన సాగించిన బుగ్గన ఇలాకాలో అంతా రివర్స్ గేర్ నడుస్తోంది. ఎన్నికల కోడ్ ముందు వరకు ప్రజల్లో పోలీసు ఎస్కార్ట్‌తో అధికార దర్పాన్ని ప్రదర్శించిన మంత్రి బుగ్గన.. ఆ తర్వాత ప్రచారాలకు దూరంగా ఉండటంతో రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. కేవలం ఆత్మీయ సమావేశాలకే పరిమితమై బుగ్గన ప్రచారం చేస్తుండటంపై ప్రజలు విస్తుపోతున్నారు. నిలదీతల భయంతోనే ప్రచారాలకు దూరంగా ఉన్నాడనే టాక్ ప్రజల్లో వినిపిస్తోంది. డోన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండు సార్లు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో సీఎం జగన్ క్యాబినెట్‌లో కీలకమైన ఆర్థిక శాఖ మంత్రిగా బుగ్గన పని చేశారు. దీంతో ఆర్థిక మంత్రిగా బుగ్గన డోన్ నియోజకవర్గంలో తిరుగులేని హవా నడిపించాడు. ఢిల్లీ, అమరావతి నుంచే రిమోట్ కంట్రోల్‌గా బుగ్గన డోన్ నియోజకవర్గాన్ని శాసిస్తూ పాలన సాగించాడు. కానీ ప్రస్తుతం పరిస్థితి అంతా తారుమారైంది.

● రివర్స్ గేర్‌తో.. దిక్కుతోచని బుగ్గన:

ఐదేళ్లపాటు ఆర్థిక మంత్రిగా బుగ్గన డోన్ నియోజకవర్గంలో తిరుగులేని ఆధిపత్యం చెలాయించారు. తాను ఏమి చెబితే.. అది జరిగి తీరాల్సిందేనన్న శాసనంతో పాలన సాగించారు. వైసీపీలో నాయకులు, కార్యకర్తలంతా కూడా బుగ్గన కనుసన్నల్లో నడుచుకోవాల్సిన పరిస్థితి ఉండేది. అయితే.. ఎన్నికల కోడ్ రాగానే ఒక్కసారిగా డోన్ నియోజకవర్గ వైసీపీలో పరిస్థితులు మారిపోయాయి. మంత్రి బుగ్గన తీరుపై పలువురు పార్టీ నాయకులు తిరుగుబాట్లు చేశారు. వైసీపీకి గుడ్‌బై చెప్పి పలువురు నాయకులు టీడీపీలో చేరిపోయారు. పార్టీ నాయకుల రివర్స్ గేర్‌తో బుగ్గన ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

● ప్రచారాలకు దూరం.. దూరం

ఎన్నికల షెడ్యూల్ వెలువడే రోజు వరకు మంత్రి బుగ్గన నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఎన్నికల కోడ్ ఎప్పుడైతే వచ్చిందో.. బుగ్గన అధికార హవా ఒక్కసారిగా తారు మారైంది. మంత్రి బుగ్గన ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. వైసీపీ కార్యాలయంలోనే ఆత్మీయ సమావేశం నిర్వహించి అదే ప్రచారంగా చేస్తున్నారు. డోన్; ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో కేవలం ఆత్మీయ సమావేశాలకే పరిమితమై బుగ్గన ఓట్లను అడిగే ఫార్ములాను అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకు కేవలం డోన్‌లో ఓ వార్డులో పర్యటించి తూతూ మంత్రంగా ప్రచారం నిర్వహించారు. నేరుగా ప్రజల్లోకి వెళితే.. ఎలాంటి సమస్యలు ఎదురవుతాయోనన్న భయంతోనే మంత్రి బుగ్గన కార్యాలయంలోనే ఆత్మీయ సమావేశాలతో ప్రచారం చేస్తున్నాడనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

● మంత్రిని కలిసేందుకు నో ఎంట్రీ..!

డోన్ నియోజకవర్గంలో ప్రజలు తమసమస్యలు చెప్పుకునేందుకు మంత్రి బుగ్గన కలవాలంటే నో ఎంట్రీ అన్నట్లుగా వ్యవహరించారు. ఈ ఐదేళ్ల కాలంలో ప్రజలు నేరుగా మంత్రిని కలుసుకున్న దాఖలాలు ఎప్పుడూ లేదన్నది చర్చ సాగుతోంది. ఎక్కువ సమయం మంత్రి బుగ్గన అమరావతి, ఢిల్లీ పర్యటనలతోనే గడిపారు. నియోజకవర్గంలో మంత్రి బుగ్గన పర్యటించినా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకే పరిమితమయ్యారు. దీంతో ప్రజలు నేరుగా మంత్రిని కలిసి తమ సమస్యలు చెప్పుకునే వీల్లేకుండా పోయిందని సాకు వినిపిస్తోంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సీఎం జగన్ ఎంతో ఆర్బాటంగా చేపట్టినా డోన్ నియోజకవర్గంలో ఆ కార్యక్రమాన్ని మంత్రి బుగ్గన స్థానిక నాయకులకే పరిమితం చేశారు. అందుకోసమే ప్రస్తుతం ఎన్నికల సమయంలో కూడా ప్రచారాలకు మంత్రి బుగ్గన దూరంగా ఉన్నారన్నది రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ఓటరు నాడి

చాగలమర్రి, ఏప్రిల్ 25:

సమర్థుడైన పాలకుడికే ఓటు వేస్తా



ఓటు అనే ఆయుధం రాష్ట్ర ప్రజల తలరాతలు మార్చేలా ఉండాలి. అవినీతికి దూరంగా ఉండే సమర్థమైన నాయకుడికి నా ఓటు వేస్తా. ఈ సారి ఎన్నికల్లో తొలిసారి ఓటు వేసే అవకాశ వచ్చింది. ఓటు వేయబోతున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ సారి ప్రలోభాలకు లొంగకుండా మంచి అభ్యర్థిని ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలి. మంచి ఆలోచన ఉన్న వారు గెలిస్తే అభివృద్ధి, సంక్షేమం జరుగుతుంది.

- కమాల్‌బీ, యువతి, చాగలమర్రి

రైతులను ఆదుకోవాలి



ఎన్నికల్లో రైతులకు ఆశ చూపిస్తారు. ఎన్నికలు ముగిసిన తరువాత చుక్కలు చూపించడం పరిపాటిగా మారింది. రైతు ప్రభుత్వంగా చెప్పుకొని విస్మరించడం తగదు. రైతులకు అన్ని విధాలుగా మేలు చేయాలి. భవిష్యత్తులో ఆహార సంక్షోభం రాకుండా ఉండాలంటే రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. రైతుల సంక్షేమం కోసం పాటుపడే నాయకుడికే ఓటు వేస్తా.

- ఖాదర్‌వలి, రైతు, చాగలమర్రి

పింఛన్ నిలిపి అన్యాయం చేశారు



వైసీపీ పాలనలో పింఛన్ నిలిపి అన్యాయం చేశారు. 15 ఏళ్ల నుంచి దివ్యాంగుల పింఛన్ ప్రభుత్వం ఇచ్చేది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక మూడేళ్ల నుంచి పింఛన్ నిలిపి వేశారు. మేము మనుగడ సాగించాలంటే రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలి. దివ్యాంగులకు మేలు చేసే పార్టీకే ఓటు వేస్తా.

-షేక్.అమిరూన్, దివ్యాంగురాలు, చాగలమర్రి

ఉపాధి కల్పించే వారికే ఓటు



చదువుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే పార్టీకే ఓటు వేస్తా. ఉద్యోగాలు లేక యువత ఇతర రాష్ట్రాలకు వెళ్తోంది. రాష్ట్రంలోనే చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా నేతలు కృషి చేయాలి. ప్రజల సమస్యలు పరిష్కరించే నాయకుడికే ఓటు వేస్తా. ఉత్తమ నాయకులను ఎన్నుకునేందుకు ప్రలోభాలకు గురి కాకూడదు. ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలి.

- ఉసేన్‌బాషా, డిగ్రీ, చాగలమర్రి

ఎన్నికల గుర్తుల చరిత్ర ఇది..!



ఆత్మకూరు, ఏప్రిల్ 25: భారతదేశంలో 1952లో జరిగిన తొలి ఎన్నికల సమయానికి అక్షరాస్యత 16శాతమే ఉండేది. దీంతో ఓటర్లు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లను గుర్తించడం కష్టతరం కాబట్టి అభ్యర్థులను సులభంగా గుర్తించేందుకు వీలుగా బ్యాలెట్ పత్రంలో గుర్తులను ఉంచాలని నిర్ణయించారు. ఇందుకుగాను 1950లో ప్రముఖ చిత్రకారుడు ఎంఎస్ సేథితో పెన్సిల్ ద్వారా పలు చిత్రాలను గీయించి వాటిలో పలు గుర్తులను ఎన్నికల బ్యాలెట్ పత్రంలో ఉపయోగించుకున్నారు. అలా నేటికీ పలు రకాలుగా ఆధునికతను సంతరించుకుని ఎన్నికల గుర్తులు రూపొందాయి. కాగా ఎంఎస్ సేథి 2000 సంవత్సరంలో కన్నుమూశారు. ఇదిలావుంటే కేంద్ర ఎన్నికల కమిషన్ గుర్తించబడిన జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలకు వారు ఎంచుకున్న గుర్తులను కేటాయించేవారు. ఆయా రాజకీయ పార్టీల తరుపున బీ-ఫామ్ సమర్పించి పోటీ చేసే వారికి ఆ పార్టీ గుర్తులను కేటాయించారు. అయితే ఈవీఎంలు వచ్చాక గుర్తులతో పాటు అభ్యర్థి పేరు, ఫొటోతోపాటు కేటాయించిన గుర్తును అందుబాటులో ఉంచారు.

కర్నూలు అసెంబ్లీకి 56 నామినేషన్లు

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి చివరి రోజు 21 నామినేషన్లను ఆర్‌ఓ స్వీకరించారు. గురువారం నగర పాలక సంస్థ కార్యాలయంలో అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఏ.భార్గవతేజ తన చాంబర్‌లో నామినేషన్లు స్వీకరించారు. ఇప్పటి వరకు కర్నూలు అసెంబ్లీకి 56 నామినేషన్లు వచ్చాయి.

1989లో తొలి బహిరంగ సభ

నంద్యాలకు వచ్చిన రాజీవ్‌గాంధీ.. జ్ఞాపకం



ప్రసంగిస్తున్న రాజీవ్‌గాంధీ, అనువదిస్తున్న మర్రి చెన్నారెడ్డి (ఫైల్)

నంద్యాల టౌన్, ఏప్రిల్ 25 : 1989లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న వేళ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రచార పర్వాన్ని ప్రారంభించిన సమయంలో.. తొలి బహిరంగ సభను నంద్యాలలో ఏర్పాటు చేశారు. బొమ్మలసత్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభకు దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హాజరై ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. నంద్యాల సభలో రాజీవ్‌గాంధీ ప్రసంగించగా వేదికపై ముగ్గురు ఉద్దండులకు మాత్రమే అవకాశం దక్కింది. రాజీవ్‌గాంధీ ప్రసంగిస్తుండగా ఆయన హిందీ ప్రసంగాన్ని మర్రి చెన్నారెడ్డి అనువదించారు. వేదికపై వేసిన కుర్చీలో కూర్చున్న వ్యక్తి కర్నూలు జిల్లా పెద్దాయనగా రాష్ట్ర, కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీలో చక్రం తిప్పిన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి. బొజ్జా వెంకటరెడ్డి(నంద్యాల మాజీ ఎంపీ) కూడా జిల్లా డీసీసీ అధ్యక్ష పదవి హోదాలో రాజీవ్‌గాంధీ ఎన్నికల సభలో వేదికపై అవకాశం దక్కించుకున్నారు.

ఎన్నికల హామీ.. ఎత్తేశారు..

- ● రాయల్టీ చెక్ పోస్టు ఎత్తేస్తామని వైసీపీ హామీ
- ● అధికారంలోకి వచ్చాక ఆ దిశగా ఆలోచించని వైనం
- హామీని విస్మరించి అదనపు పన్నులతో పరిశ్రమపై భారం





కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 25: ఎన్నికల ముందు ఆర్భాటంగా వివిధ వర్గాలకు హామీలు గుప్పించడం ఎన్నికలయ్యాక వాటిని గాలికి వదిలేయడం రాజకీయ నాయకులకు పరిపాటిగా మారింది. ముఖ్యంగా బనగానపల్లె నియోజకవర్గంలో నాపరాళ్ల పరిశ్రమకు గుది బండగా మారిన రాయల్టీ చెక్‌పోస్టు ఎత్తివేస్తామని 2019 ఎన్నికల్లో కీలక హామీ ఇచ్చిన వైసీపీ నేతలు అధికారంలోకి వచ్చాక ఆ హామీని పూర్తిగా విస్మరించారు. హామీని విస్మరించడంతోపాటు తెలుగుదేశం పార్టీలో సవ్యంగా సాగిన కుటీర పరిశ్రమ లాంటి నాపరాళ్ల పరిశ్రపై అదనపు పన్నులతో భారం మోపి పరిశ్రమను పీకల్లోతు కష్టాల్లో ముంచారు. దీంతో వైసీపీ ప్రభుత్వం, ఆపార్టీ నేతల తీరుపై నాపరాళ్ల పరిశ్రమ వర్గాలు మండి పడుతున్నాయి. నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల మండలం బందార్లపల్లె వద్ద, అనంతపురం జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన రాయల్టీ చెక్‌పోస్టును వైసీపీ అధికారంలోకి రాగానే ఎత్తివేస్తామని 2019 ఎన్నికల్లో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించింది. ఆ మేరకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. కాటసానితోపాటు అప్పుడు వైసీపీ కోసం పని చేసిన దివంగత నేతలు చల్లా రామకిష్టారెడ్డి, ఎర్రబోతుల వెంకటరెడ్డి కలిసి బనగానపల్లె నియోజకవర్గంలో ఊరు వాడ తిరిగి రాయల్టీ చెక్‌పోస్టు ఎత్తి వేస్తామన్న హామీని బలంగా గుప్పించారు. ఇది నిజమని నమ్మిన నాపరాళ్ల పర్రిశమ యజమానులు, కార్మికులు 2019 ఎన్నికల్లో గంప గుత్తుగా వైసీపీకి ఓటు వేశారు. అయితే ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదిశగా కనీస ప్రయత్నమే చేయకపోవడాన్ని నియోజకవర్గ ప్రజలు తప్పు పడుతున్నారు. నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల మండలంతో పాటు, అవుకు, బనగానపల్లె మండలాల్లో వేలాది మంది ప్రజలు నాపరాళ్ల పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇక్కడ లభించే నాపరాళ్ల అత్యధికంగా తాడిప్రతి పాలిషింగ్ యూనిట్లకు, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు తరలివెళతాయి. అయితే బార్డర్ దాటాలంటే రాయల్టీ చెక్‌పోస్టు వద్ద 5 టన్నులకు రూ490 రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ట్రాక్టర్లు, లారీలకు టన్నేజీని బట్టి వేలాది రూపాయలు రాయల్టీ చెల్లించాల్సి ఉంది. తీవ్ర నష్టాల్లో ఉన్న నాపరాళ్ల పరిశ్రమకు రాయల్టీ చెల్లించడం భారంగా మారింది. ఈ స్థితిలో రాయల్టీ చెక్‌పోస్టును ఎత్తివేసి నాపరాళ్లను ఫ్రీగా తరలించుకునేలా చేస్తామన్న వైసీపీ నేతల హామీ పరిశ్రమ వర్గాలకు ఊరట కలిగించింది. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే కాటసానిని హామీని విస్మరించడంతో పరిశ్రమ వర్గాలు మండిపడుతున్నాయి. రాయల్టీ చెక్‌పోస్టు ఎత్తివేయకపోగా, చిరు పరిశ్రమ అయిన నాపరాళ్ల పరిశ్రమపై వైసీపీ ప్రభుత్వం మరిన్ని అదనపు భారాలు మోపింది. ఏడీఆర్ (అడ్వాన్స్‌డ్ డెడ్ రెంట్) 1 హెక్టారుకు రూ.52వేలు ఉండగా దీనికి ప్రీమియం అమౌంట్ కింద 10రెట్లు రూ.5.20లక్షలు చెల్లించాలని నిబంధన తీసుకవచ్చారు. అదేవిధంగా ఎస్‌డీ(సెక్యూరిటీ డిపాజిట్) మూడు రేట్లు రూ.1.56లక్షలు చెల్లించేలా నిబంధన తీసుకరావడంతో నాపరాళ్ల పరిశ్రమ నిలిచిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫలితంగా ఆయా వర్గాల్లో వైసీపీ నేతలు, ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది.

చంద్రబాబు హామీతో పరిశ్రమ వర్గాలకు ఊరట

ఇదిలా వుండగా ఇటీవల బనగానపల్లెలో పర్యటించిన మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్ర బాబు నాపరాళ్ల పర్రిశమపై భారాలు తగ్గించి, పరిశ్రమకు పూర్వ వైభవం తెప్పిస్తామని హామీ ఇవ్వడం ఆ వర్గాలకు ఊరట కలిగించింది. చిన్న పరిశ్రమల పట్ల తమ పార్టీ పెద్ద మనస్సుతో ఆలోచిస్తుందని, నాపరాళ్ల పరిశ్రమకు అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో టీడీపీ అధికారంలోకి వస్తే నాపరాళ్ల పరిశ్రమకు మంచి రోజులు వస్తాయన్న ఆశాభావం ఏర్పడింది.





ఆకలి తీర్చే అన్నపూర్ణమ్మనవుతా..

కోట్ల సుజాతమ్మ రొట్టెలు కాలుస్తూ అందర్నీ ఆకట్టుకున్నారు. నిత్యం జనంలో ఉంటూ ఆమె ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఈ క్రమంలోనే ఆమె ఒక్కసారిగా సాధారణ మహిళగా మారిపోయి రొట్టెలు తట్టి కట్టెల పొయ్యి మీద వేసి కాల్చారు. గురువారం డోన్ మండలంలోని కామగాని గుంట్ల గ్రామంలో టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓ ఇంటి వద్ద మహిళ కట్టెల పొయ్యి మీద రొట్టెలు కాలుస్తుండగా.. కోట్ల సుజాతమ్మ వెళ్లి పలకరించారు. టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఆ మహిళకు తెలియజేశారు. అనంతరం ఆ మహిళ స్థానంలో కూర్చుని కట్టెల పొయ్యిపై రొట్టెలు చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. కోట్ల సుజాతమ్మ రొట్టెలు చేస్తుండగా అక్కడున్న మహిళలంతా ఆమె వైపే చూస్తుండిపోయారు.

- డోన్, ఏప్రిల్ 25


ఎండిపోయిన నది నుంచి అరకొరగా ఉన్న నీటిని పొలాలకు వాడుకుంటున్న రైతులు

వైసీపీ అధికారం చేపట్టిన ఐదేళ్లలో ఆర్డీఎస్ ఊసే ఎత్తలేదు. దీంతో మూడు నియోజకవర్గాల్లోని రైతుల ఆశలు అడియాశలయ్యాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.1986 కోట్లు మంజూరు చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఐదేళ్లలో పైసా నిధులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టరు మధ్యలోనే పనులు నిలిపివేశారు. దీంతో రైతులు ఆశలు నీరుగారాయి.

ఆర్డీఎస్ ఊసే లేదా?

- గత ఎన్నికల్లో ఎమ్మెల్యే హామీలు గాలికే..
- చంద్రబాబు హయాంలో రూ.1986 కోట్ల ఆర్డీఎస్ పనులకు నిధులు మంజూరు
- పైసా విదల్చని వైసీపీ ప్రభుత్వం
- బీళ్లుగా మారిన భూములు


ఆర్డీఎస్ కుడి కాలువ పూర్తయిన సుయిస్ పనులు

మంత్రాలయం, ఏప్రిల్ 25: మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు, నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగు నీరు అందించాల్సిన ఆర్డీఎస్ కుడి కాలువ ఊసే ఎవ్వరికీ పట్టలేదు. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆర్డీఎస్ పనులు పూర్తి చేసి తాగు, సాగునీరు అందిస్తానని ఇచ్చిన హామీని మర్చిపోయారు. దీంతో మూడు నియోజకవర్గాల్లోని రైతుల ఆశలు అడియాశలయ్యాయి. పది ఎకరాలు ఉన్న రైతు కూడా పంటలు పండక వలసబాట పట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో నాటి సీఎం చంద్రబాబు పశ్చిమ కరువు ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో 2019 ఫిబ్రవరిలో మధ్యతరహా నీటి పారుదల శాఖ ద్వారా రూ.1986 కోట్లు మంజూరు చేశారు. నేషనల్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులు చేపట్టి ఆర్డీఎస్ కుడి కాలువ నాలుగు స్లూయిస్‌లు, హెడ్ రెగ్యులేటర్ల పనులు చేపట్టారు. దాదాపు రూ.5 కోట్లు ఖర్చు చేస్తే.. వైసీపీ అధికారంలోకి రాగానే ఐదేళ్లలో పైసా నిధులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టరు మధ్యలోనే పనులు నిలిపివేశారు. ఆర్డీఎస్ కుడి కాలువను 160 కి.మీ. నిర్మించాల్సి ఉండగా దాదాపు 40 ఎకరాల్లో భూసేకరణ పనులు పూర్తయ్యాయి. తుంగభద్ర నది నుంచి 4 టీఎంసీలు డైవర్షన్ చేసి మంత్రాలయం ఎమ్మిగనూరు, గోనెగండ్ల గూడూరు, బెళగల్ తదితర మండలాల్లోని లక్షలాది ఎకరాలకు తాగు, సాగునీరు అందించే ప్రాజెక్టు పనులు అర్ధాంతరంగా ముగిసిపోయాయి. రైతన్నల నోట్లో వైసీపీ ప్రభుత్వం మట్టి కొట్టింది. అరకొర భూగర్భజలాలను బోర్ల ద్వారా పది రోజులకొకసారి సరఫరా చేసి పల్లెలు గొంతు తడుపుతున్నారు. టీడీపీ ప్రభుత్వం వస్తేనే ఈ ప్రాజెక్టు పనులు పూర్తవుతుందని ఆ మూడు నియోజకవర్గాల ప్రజలు పేర్కొంటున్నారు.



పనులను వైసీపీ నిర్లక్ష్యం చేసింది

చంద్రబాబు హయాంలో ఆర్డీఎస్ కుడి కాలువ పనులకు నిధులు విడుదల చేసినప్పటికీ వైసీపీ ప్రభుత్వం ఈ కాల్వ పనులను నిర్లక్ష్యం చేసింది. దీంతో తుంగభద్ర నదిలో నీరు లేక పంటలు ఎండిపోయి, ఈ ఏడాది అప్పులకు వడ్డీలు కూడా కట్టలేని పరిస్థితుల్లో ఉన్నాం.

- బోయ రంగస్వామి, సాతనూరు, కోసిగి మండలం


నిర్మాణ మధ్యలో ఉన్న హెడ్ రెగ్యులేటర్

● రైతులను వైసీపీ ప్రభుత్వం మోసం చేసింది

ఐదేళ్లలో రైతులను వైసీపీ ప్రభుత్వం మోసం చేసింది. ఆర్డీఎస్ కుడి కాలువ పనులు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేస్తే.. వైసీపీ ప్రభుత్వం పైసా నిధులు ఇవ్వకుండా మోసం చేసింది. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే.. తాగునీరు, సాగు నీరు మాకు అందుతుంది.

- లక్ష్మీకాంతరెడ్డి, రైతు, దొడ్డిమేకల గ్రామం, పెద్దకడుబూరు



నాడు సారా.. నేడు టెట్రా..!

● ఎన్నికల వేళ మద్యానికి డిమాండ్


'పారుగు' మందు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 25: ఎన్నికలు వస్తే చాలు కుప్పలు..తెప్పలుగా సారా పాకెట్లు తెచ్చి మందుబాబులకు పంచేవారు. పదేళ్ల క్రితం సారా ప్యాకెట్ ఒక్కోటి రూ.10 లోపు ఉండేది. ఓటింగ్‌కు కొన్ని రోజుల ముందుగానే అభ్యర్థులు వాటిని తెప్పించి డంప్ చేసుకునే వారు. పోలింగ్ ముందు రోజు లేదా పోలింగ్ రోజు వాటిని ఓటర్లకు పంచేవారు. ఈ క్రమంలో ఆంధ్ర ప్రాంతంలో ఎన్నికలు జరుగుతున్నాయంటే కర్ణాటక మద్యానికి మంచి డిమాండ్ ఉండేది. సరిహద్దు ప్రాంతాలైన కర్నూలు, మంత్రాలయం, ఆలూరు, సి.బెళగల్, కోడుమూరు మండలాల పరిధిలోని సరిహద్దు గ్రామాల్లో ముందుగానే సారా ప్యాకేట్లు తెప్పించే వారు. అయితే మన రాష్ట్రంలో సారాను నిషేధించడంతో వాటి స్థానంలో ప్రస్తుతం టెట్రా ప్యాకెట్లు వస్తున్నాయి. కర్ణాటక నుంచి నేరుగా, లేదా తెలంగాణలోని కొన్ని ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో టెట్రా ప్యాకెట్లు తెప్పించుకుంటున్నారు. ఇక్కడి మద్యం ధరలకు కంటే కర్ణాటక టెట్రా ప్యాకెట్ల ధరలు తక్కువగా ఉండటమే డిమాండ్‌కు ప్రధాన కారణం. ర్యాలీలు, ఊరేగింపులు. సభలు, సమావేశాల్లో టెట్రా ప్యాకెట్లు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి.

మద్దతు మీకే.. మాకేం ఇస్తారు...?

● సామాజిక వర్గం నేతల డిమాండ్లతో అభ్యర్థుల బేజారు



నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 25: సామాజిక వర్గం నేతల డిమాండ్లతో అభ్యర్థుల బేజారెత్తిపోతున్నారు. తమ వర్గం ఓట్లు వేయించాలంటే ఎంత ఇస్తారంటూ బేరసారాలకు దిగుతున్నారు. దీంతో ఏం చెప్పాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. అభ్యర్థుల ఆర్థిక పరిస్థితిని బట్టి రూ.5 నుంచి రూ.10 లక్షలతో పాటు అన్ని ఖర్చులు పెట్టుకోవాలంటూ అల్టిమేటం జారీ చేస్తున్నారు. వార్డుల వారీగా చేరికల పేరుతో అభ్యర్థుల వద్ద నుంచి నగదు డిమాండ్ చేస్తున్నారు. ఒప్పుకోకుంటే తమకు గౌరవం ఇవ్వటం లేదని బురద చల్లటం ఆనవాయితీగా మారింది. వీరికి డబ్బులు ఇస్తే ఓట్లు వేయించగలరా లేదా అని అభ్యర్థులు ఆరా తీస్తున్నారు. ఓట్లు రాలతాయి అనుకుంటే మొదట కొంత మొత్తం ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

పోస్టల్ బ్యాలెట్ల దరఖాస్తులు 17,352

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 25: కర్నూలు జిల్లా వ్యాప్తంగా 8 నియోజకవర్గాల నుంచి పోస్టల్ బ్యాలెట్లకు 17,352 దరఖాస్తులు వచ్చాయి. ఫారం-12కి 15,063 దరఖాస్తులు రాగా, ఫారం-12డికి 1,024, అత్యవసర సేవల కింద (ఫారం-12డి) 1,265, మొత్తం 17,352 దరఖాస్తులు వచ్చినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుల వివరాలు..

నియోజకవర్గం	ఫారం-12	ఫారం-12డి (అత్యవసర సేవలు)		మొత్తం
కర్నూలు	2883	53	174	3110
కోడుమూరు	2204	151	206	2561
పత్తికొండ	1094	118	99	1311
ఆలూరు	800	228	72	1100
ఆదోని	1544	63	241	1848
ఎమ్మిగనూరు	2128	171	110	2409
మంత్రాలయం	345	81	44	470
పాణ్యం	4543	159	319	4543
మొత్తం	15063	1024	1265	17352

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాల ఏర్పాటు



కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్‌పై ఎన్నికల యంత్రాంగం వేగం పెంచింది. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తుల సమయం కూడా పూర్తి కావడంతో ఓటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లా వ్యాప్తంగా మే 5 నుంచి 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ జరగనుంది. ఈ మేరకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలను అధికారులు నిర్ణయించారు.

నియోజకవర్గం		పోలింగ్ కేంద్రం
కర్నూలు	:	ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ హై స్కూల్
పాణ్యం	:	ప్రభుత్వ బాలుర హైస్కూల్, బీక్యాంపు,
కోడుమూరు	:	ప్రభుత్వ టౌన్ మోడల్ స్కూల్, కోట్ల సర్కిల్
ఎమ్మిగనూరు	:	ఎంపీడీవో కార్యాలయం మీటింగ్ హాల్
మంత్రాలయం	:	జడ్పీహెచ్ పాఠశాల
ఆదోని	:	నెహ్రూ మెమోరియల్ హైస్కూల్
ఆలూరు	:	ప్రభుత్వ బాలుర హైస్కూల్-2, అంబేడ్కర్ సర్కిల్
పత్తికొండ	:	ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ఆదర్శమూర్తులు

- దేశానికే స్ఫూర్తిగా నిలిచిన ఓర్వకల్లు పొదుపు మహిళలు
- 1998లో చంద్రబాబు నాయుడు హయాంలో డ్వాక్రా సంఘాల ఏర్పాటు
- మండలంలో 980 సంఘాలు, 10,500 మంది సంఘం సభ్యులు



ఓర్వకల్లు, ఏప్రిల్ 25: సమాజానికి పట్టిన రుగ్మతలు తొలగాలంటే స్వచ్ఛ పాలకులు అవసరం. అలాంటి వారిని ఎన్నుకోవడం ఓటర్ల బాధ్యత. ప్రతి ఒక్కరూ చైతన్యంతో వ్యవహరిస్తేనే వ్యవస్థ సరైన మార్గంలో నడుస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అలాంటి చైతన్యవంతమైన పాత్రను ఓర్వకల్లు పొదుపు మహిళలు పోషిస్తున్నారు. స్వయం ఉపాధితో వారు సాధిస్తున్న అభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. 1998లో నాటి టీడీపీ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలను ప్రారంభించారు. అయితే.. ఓర్వకల్లు మండలంలో 980 సంఘాలు ఉన్నాయి. 10,500 మంది సంఘం సభ్యులు ఉన్నారు. అయితే.. చంద్రబాబు ఏర్పాటు చేసిన పొదుపు సంఘాలతో ఓర్వకల్లు మహిళలు దేశానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. అయితే.. ఇతర రాష్ట్రాలకు వెళ్లి అక్కడ కూడా సంఘాలను ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారు. పొదుపు సంఘాల మహిళలు ఓటర్ల చైతన్య కరదీపికలుగా నిలిచారు. అలాగే మహిళలకు తోడుగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తుంటారు. ఐదేళ్లకోసారి వచ్చే ఓటర్ల పండుగ ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణకు వజ్రాయుధం. పాణ్యం నియోజకవర్గ మహిళా ఓటర్లు చైతన్యంతో తమ తలరాతలను తామే మార్చుకున్న వీరవనితలు. కుటుంబాలను సుమున్నతంగా తీర్చిదిద్దుకుని సమాజానికి ఆదర్శంగా నిలిచిన ఆదర్శమూర్తులు. అలాగే పొదుపు సంఘాల మహిళలు ఓటర్లపై అవగాహన ఎంతగానో కలిగి ఉంది. మే 13న జరిగే ఎన్నికల్లో ఓర్వకల్లు పొదుపు మహిళలు ముఖ్యంగా నిలుస్తున్నారు.

● పొదుపు సంఘాల స్ఫూర్తి చంద్రబాబే:

1998లో ప్రారంభించిన డ్వాక్రా సంఘాల నేపథ్యంలో నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఓర్వకల్లు మండల ఐక్య సంఘాన్ని సందర్శించారు. పొదుపు మహిళలతో ముఖాముఖి చర్చ జరిగింది. అప్పట్లోనే పొదుపు సంఘాల మహిళలు దినదినాభివృద్ధి చెంది ఆదర్శంగా నిలిచారు. ఇక్కడి పొదుపు మహిళలు కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఒడిస్సా, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలకు వెళ్లి అక్కడి మహిళలను పొదుపు సంఘాలుగా ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారు. ఓర్వకల్లు మహిళలు ఆదర్శంగా నిలవడానికి కారణం చంద్రబాబే అని పొదుపు మహిళలు గర్వించుకుంటున్నారు.

● ప్రజల ఆకాంక్షలను గౌరవించాలి



చట్టసభలకు ఎన్నికయ్యే అభ్యర్థులు ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ అందుకు అనుగుణంగా పని చేయాలి. జనాకర్షక పథకాలకే కాకుండా అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ల్యాండ్ మార్క్‌గా ఉండే ప్రాజెక్టులు నిర్మిస్తే.. రాష్ట్రానికి అభివృద్ధి సూచికలుగా మారుతాయి. చట్టాలపై అవగాహన ఉండి చట్ట సభల్లో చురుగ్గా వ్యవహరిస్తూ భవిష్యత్ తరాలకు భరోసా కల్పించే పథకాలు రూపొందించాలి. అలాంటి వారికి ఓటు వేయాలి.

- సూర్య నారాయణ రెడ్డి, విశ్రాంతి ఉద్యోగి, ఓర్వకల్లు



● ప్రలోభాలతో జాగ్రత్త

ఓటర్లను ప్రలోభ పెట్టి గెలవాలనుకునే వారిని ఓడించాలి. ఇలాంటివారు గెలిస్తే.. సంపాదనపైనే దృష్టి పెడతారు. ఓటరు బాధ్యతగా వ్యవహరిస్తే రాష్ట్ర భవిష్యత్తును మార్చే ప్రభుత్వం సాధ్యం. అభివృద్ధి, ప్రాజెక్టులు, పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తే.. నేతలను ఎన్నుకుంటే రాష్ట్రానికి, దేశానికి మేలు జరుగుతుంది. ఈ దిశగా ఓటర్లు ఆలోచించాలి.

- పుష్పరాజు, విశ్రాంతి ఉద్యోగి, ఓర్వకల్లు

సమర శంఖం



నామినేషన్ నాదం మోగింది..!

తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ సమర శంఖం పూరించారు. నామినేషన్ వేసేందుకు గురువారం కొండారెడ్డి బురుజు నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చారు. దీంతో అభిమానుల సందడి చూసిన భరత్ రెట్టింపు ఉత్సాహంతో వాహనంపై నిలబడి శంఖం ఊదారు. ఈ సందర్భంగా నగరంలో టీడీపీ శ్రేణుల కోలాహలం కనిపించింది.

- కర్నూలు అర్బన్



జెండా కట్టెలతో ఉపాధి

సార్వత్రిక ఎన్నికల్లో మేదరులకు ఫుల్ డిమాండ్ ఉంది. ఆయా రాజకీయ పార్టీల నాయకులు జెండా కట్టెల కోసం మేదరుల వద్దకు క్యూ కడుతున్నారు. రోజుకు వందలాది జెండాలు కడుతున్నామని కోసిగికి చెందిన మేదరి గోరంట్ల తెలిపాడు. ఒక్కో పార్టీకి వేల జెండా కట్టెలు కట్టి పార్టీల నాయకులకు అందించామని, ఈ ఎన్నికల్లో ఫుల్ బిజీ అయ్యామని చెప్పాడు.

- కోసిగి

బీసీకి జన'హారతి'

ఎన్నికల వేళ రాజకీయ నాయకులు అనునిత్యం ప్రజల్లోనే ఉంటున్నారు. అభిమాన నాయకులు వస్తే పల్లెల్లో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. బనగానపల్లె పట్టణంలోని కొండపేటలో ప్రచారం చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డికి గురువారం రాత్రి మహిళలు హారతులతో ఘన స్వాగతం పలికారు. కొండపేటలో ప్రచారం చేస్తున్న మహిళలు బీసీపై అభిమానంతో వీధి వీధినా హారతులతో స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటారు.

- బనగానపల్లె



నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

'టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు'



గోస్పాడులో పర్యటిస్తున్న శబరి, ఫరూక్ తదితరులు

గోస్పాడు, ఏప్రిల్ 25: వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో వెనుకబడిందని, మళ్లీ తెలుగుదేశం పార్టీతోనే భవిష్యత్తు ఉంటుందని నంద్యాల టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి అన్నారు. గురువారం గోస్పాడులో ఇంటింటి ప్రచారం, రోడ్‌షో నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సూపర్ సిక్స్ పథకాలు, యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి రూ.3 వేలు, బీసీలకు 50 సంవత్సరాలకే రూ.4 వేల పింఛన్, రాజధాని అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, వచ్చేది కూటమి ప్రభుత్వమేనని, వైసీపీ ప్రభుత్వానికి ఓటమి ఖరారైందని అన్నారు. ప్రజలు రాష్ట్ర భవిష్యత్తు కోసం, తమ పిల్లల భవిష్యత్తు కోసం టీడీపీకి ఓటు వేయాలని అన్నారు. మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, వీర సింహారెడ్డి, శీలం భాస్కర్‌రెడ్డి, పల్లె విశ్వనాథ్‌రెడ్డి, జిన్ను శ్రీనివాసరెడ్డి, భూమా హుసేని, శ్రీనివాసయాదవ్, పెద్ద హుసేని, జూపల్లె రామగోపాల్‌రెడ్డి, ఎస్ ఓబుల్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ఉద్యోగాలు లేవు: బైరెడ్డి



జలకనూరులో మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

మిడుతూరు, ఏప్రిల్ 25: తల్లిదండ్రులు అప్పులు చేసి పిల్లలను చదివించారని, అయితే వైసీపీ పాలనలో యవతకు ఉద్యోగాలు లేవని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం జలకనూరు, తలముడిపి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. యవతకు ఉద్యోగాలు రావా లంటే చంద్రబాబు రావాలని అన్నారు. ప్రతి ఓటరు టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాగేశ్వరరెడ్డి, స్వామిరెడ్డి, బగీరథ రెడ్డి, అంకి రెడ్డి, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల బాలికలకు వేసవి శిక్షణ శిబిరం



కోచ్‌లతో సమీక్షిస్తున్న డాక్టర్ రవికృష్ణ

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 25: కళారాధన సాంస్కృతిక సంస్థ నంద్యాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 22వ తేదీ నుంచి మే 25 వరకు కళాసాధన 2024 పేరిట ఉచిత లలిత కళలు, క్రీడలు, వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు కళారాధన అధ్యక్ష కార్యదర్శి ,డా. మధుసూదనరావు, డాక్టర్ రవికృష్ణ తెలిపారు. గురువారం నంద్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 22మంది కోచ్‌లతో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ శిబిరంలో శాస్త్రీయ నృత్యం, ఆధునిక నృత్యం, శాస్త్రీయ, లలిత సంగీతం, వాయిద్య సంగీతంలో గిటార్, కీబోర్డు, మిమిక్రీ, వెంట్రీలాక్విజమ్, చిత్రలేఖనం, చక్కటి చేతి రాత, హస్తకళలు ఫ్యాబ్రిక్ పెయింటింగ్, పద్యపఠనం, సంస్కృత శ్లోకాలు, కవితా గానం, కవితా రచన, చదరంగం, కరాటే, త్రైకాండో, వ్యక్తిత్వం వికాసం వంటి అంశాలలో శిక్షణ ఇస్తున్నామన్నారు. మే 25వ తేదీన ముగింపు ఉత్సవంలో శిక్షణ పొందిన బాలబాలికల చేత ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వేసవి శెలవుల్లో బాలబాలికలు, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫ్యాన్‌కు పరాభవం తప్పదు: గౌరు చరిత



సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న గౌరు చరిత

కల్లూరు, ఏప్రిల్ 25: పాణ్యం నియోజకవర్గంలో ఫ్యాన్‌కు పరాభవం తప్పదని టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 33వ వార్డు పాతకల్లూరు, 36వ వార్డు అయ్యవారి నాగలాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గౌరుచరిత మాట్లా డుతూ టీడీపీ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, 36వ వార్డు ఇన్‌చార్జి ఆర్.తిరుమలేశ్వ రరెడ్డి, ఆర్.లోకేశ్వరరెడ్డి, పెద్దబీచుపల్లి, నాగసుబ్బారెడ్డి, మద్దీశ్వర్‌రెడ్డి, వేదాంత్‌రెడ్డి, 33వ వార్డు నాయకులు ఎన్‌వీ.రామకృష్ణ, ఎస్.ఫిరోజ్, పవన్‌కుమార్, సంపతి లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

● పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత సమక్షంలో కల్లూరు అర్బన్ 41వ వార్డుకు చెందిన గైనకాలజిస్టు డాక్టర్ కావ్యతో పాటు పలు కుటుంబాలు టీడీపీలో చేరాయి. క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. ఓర్వ కల్లు మండలం గుట్టపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు మర్రికుంట గోపాల్‌రెడ్డితోపాటు 10 కుటుంబాలు నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకట రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. గుట్టపాడు సర్పంచ్ మోహన్‌రెడ్డి ఉన్నారు.

● గౌరు చరితకు కర్నూలు టూ వీలర్ వేల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మద్దతు తెలిపారు. కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి, ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, యూనియన్ నాయకులు కోటేశ్వరరావు, సుదాకర్‌రెడ్డి, అంజద్‌బాషా, చాంద్‌బాషా, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మళ్లీ జగన్ వస్తే మన భూములు తాకట్టే

● టీడీపీ నందికొట్కూరు అభ్యర్థి గిత్తా జయసూర్య ● ఎన్నికల ప్రచారం నిర్వహించిన మాండ్ర శివానందరెడ్డి, లింగారెడ్డి ● టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



సుంకేసుల గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న మాండ్ర శివానందరెడ్డి, గిత్తా జయసూర్య



పథకాల గురించి వివరిస్తున్న మాండ్ర లింగారెడ్డి

నందికొట్కూరు, ఏప్రిల్ 25: వైఎస్ జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే మన భూములను తాకట్టు పెడతారని టీడీపీ నందికొట్కూరు అభ్యర్థి గిత్తా జయసూర్య అన్నారు. పట్టణంలోని 3వ వార్డులో గురువారం శంఖారావం, బాబు సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు రూపొందించిన పథకాల గురించి ప్రజలకు వివరించారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే రీ సర్వే పేరుతో మీ పేరుమీద పట్టా భూములను తాకట్టు పెట్టుకుంటారని ఆయన ఆరోపించారు. పట్టాదారు పాసు పుస్తకాలపై తన ఫొటో వేయించుకుంటున్నారని, పొలానికి పాతే సరిహద్దు రాళ్లపై కూడా జగన్ బొమ్మ ఉండడం వెనుక అంతర్యమదేనని ఆయన ఆరోపించారు. కావున భూమి ఉన్న ప్రతి రైతు ఓటు వేసే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. టౌన్ ఇన్‌చార్జి భాస్కర్‌రెడ్డి, ముర్తుజావళి, మున్నాఫ్, లాయర్ జాకీర్, ఎన్ఎండీ జమీల్, శాలు రసూల్ ఖాన్, అప్సర్, తాఫిక్, తదితరులు పాల్గొన్నారు.

జగనాసురుడిని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం:లింగారెడ్డి

ఇసుక, అక్రమ మైనింగ్, మద్యం వంటి వాటిని దోచుకుంటున్న జగనాసురుడుని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాండ్ర లింగారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 10వ వార్డులో గత శంఖారవం, బాబు సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటి ప్రచారం చేశారు. అయ్యన్న, సురేంద్ర, అప్సర్, వేణుగోపాల్, రాజు, కృష్ణారెడ్డి, లింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: సుంకేసుల గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేశ్‌రెడ్డి, వెంటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వైసీపీ నాయకుడు మాజీ సర్పంచు రాంభూపాల్ రెడ్డి టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానంద రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య సమక్షంలో టీడీపీలో చేరాయి. రాంభూపాల్ రెడ్డి అనుచరులు వెంకట రమణయ్య, సుబ్బారావు, లేపాక్షి రెడ్డి, రామి రెడ్డి, శ్రీనివాస రెడ్డి, కుళాయి, నాయుడు, పెద్ద శ్రీనివాసులు బ్రదర్స్, కురువ బాబు, స్వామన్న తదితరులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. టీడీపీని గెలిపించాలని ఓటర్లను కోరారు.



సుంకేసుల గ్రామంలో టీడీపీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

టీడీపీతోనే యువతకు భవిష్యత్తు: బుడ్డా



బుడ్డాను సన్మానించిన జనసేన నాయకులు



వెలుగోడులో ప్రచారం నిర్వహిస్తున్న బుడ్డా శైలజ

వెలుగోడు, ఏప్రిల్ 25: టీడీపీ అధికారంలోకి వస్తేనే యువతకు భవిష్యత్తు ఉంటుందని శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరెరెడ్డి అన్నారు. గురువారం వెలుగోడు పట్టణానికి చెందిన పాల ఆబీద్, మద్దిలేటి, నాగెళ్ళ సుధీర్, గౌండా ఇబ్రహీం, ఆజీద్ అలి, ఇర్షాద్, మహబూబ్ బాషాతో పాటు 15 కుటంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. బుడ్డా మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ప్రదేష్‌ను జగన్ అప్పులాంధ్ర ప్రదేష్‌గా మార్చారన్నారు.

● వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ విజయంతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్పష్టం చేశారు. గురువారం వెలుగోడు పట్టణానికి చెందిన జనసేన పార్టీ ముఖ్యనాయకులు ధూపం అభిమన్యుడిని మాజీ మర్యాదపూర్వకంగా కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని ఆహ్వానించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బుడ్డాను జనసైనికులు ఘనంగా సత్కరించారు. జనసేన నాయకులు ఉమ్మడి కర్నూలు జిల్లా జనసేన ప్రచార కమిటీ కన్వీనర్ కర్నాటి శ్రీరాములు, శ్రీశైలం నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త రౌతు అశోక్, వివిధ మండలాల నాయకులు శేషుకుమార్, షాలుబాషా, సురేష్, మల్లి, రామయ్య, శ్యామ్, హబివుల్లా, పవన్ ఉన్నారు.

వెలుగోడులో బుడ్డా శైలజ ప్రచారం

● రాష్ట్రంలో టీడీపీ తోనే మహిళల సాధికారత సాధ్యమని శ్రీశైల నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి బుడ్డారాజశేఖరరెడ్డి సతీమణి బుడ్డా శైలజ అన్నారు. గురువారం ఆమె వెలుగోడు పట్టణంలోని గుర్రపం పేట, ఆంజనేయస్వామి ఆలయం కాలనీలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం, ఖలీల్, మాజీ ఎంపీపీలు సీతమ్మ, ఎల్లా లక్ష్మప్పుడు, సీతామహాలక్ష్మమ్మ, మాజీ ఎంపీటీసీలు వెంకటరమణ, రజీ, అమీర్ అలీఖాన్, శంకర్‌రెడ్డి, జనసేన నాయకులు సాలుబాషా పాల్గొన్నారు.

'జర్నలిస్టుల సంక్షేమానికి కృషి'

ఆత్మకూరు: నియోజకవర్గంలోని జర్నలిస్టుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో జర్నలిస్టులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బుడ్డా మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గం అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని జర్నలిస్టులు, వారి కుటుంబాలు తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు, గృహనిర్మాణాలతో పాటు ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని స్థానిక జర్నలిస్టులు మాజీ ఎమ్మెల్యే బుడ్డా దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఆయా జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్‌తో సంబంధం లేకుండా ఇళ్లస్థలాలను మంజూరు చేయిస్తానని, అవసరమైతే టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టికి జర్నలిస్టుల సమస్యలు తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

'సమర్థులను ఎన్నుకోవాలి'

ఆత్మకూరు: సమర్థవంతమైన నాయకులెవరో ప్రజలకు గుర్తించి ఎన్నుకోవాలని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు నాయకులు పెట్రోల్ బంకు బాషా తన బంధువర్గంతో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. అలాగే టీడీపీ కార్యాలయంలో కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోతుల్లా ఆధ్వర్యంలో పలు కార్పెంటర్ కుటుంబాలు టీడీపీలో చేరాయి. బుడ్డా మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని చెప్పారు. రెండున్నర ఏళ్ల వ్యవధిలోనే సుమారు రూ.1500కోట్లతో నియోజకవర్గ అభివృద్ధికి చొరవ తీసుకున్నట్లు వివరించారు. అయితే ఐదేళ్లలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. టీడీపీ, బీజేపీ పొత్తుపై అసత్య ప్రచారాలు చేసే వ్యక్తులను నమ్మవద్దని హితవు పలికారు. టీడీపీ నాయకులు వేణుగోపాల్, శివప్రసాద్‌రెడ్డి, అబ్దుల్లాపురం బాషా, షాలు పైల్వాన్, నూర్‌బేగ్, షాకీర్, అల్లిసా తదితరులు ఉన్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఎన్నికల ప్రత్యేక పోలీసు పరిశీలనాధికారికి ఎస్పీ స్వాగతం



హిమాన్షు శంకర్ త్రివేదికి స్వాగతం పలుకుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం, ఏప్రిల్ 25: ఎన్నికల ప్రత్యేక పోలీస్ పరిశీలనాధికారి హిమాన్షు శంకర్ త్రివేది గురువారం నంద్యాలకు వచ్చారు. ఆర్ అండ్ బీ అతిథి గృహానికి చేరు కున్న ఆయనకు ఎస్పీ రఘువీర్ రెడ్డి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో తీసుకుంటున్న భద్రతా పరమైన ముందస్తు చర్యలను ఎస్పీ ప్రత్యేక పోలీస్ పరిశీలనాధికారి హిమాన్షు శంకర్ త్రివేదికి వివరించారు.

కోడ్ అమలు ఏదీ?



నంద్యాల మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే శిల్పా ఫొటోతో కనిపిస్తున్న బోర్డు

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 25: ఎన్నికల కోడ్‌ను పట్టించుకునే అధికారులు కరువైనట్లు ఉంది. నంద్యాల మున్సిపల్ కార్యాలయ ఆవరణలో స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ బోర్డు వున్న కవర్‌లు చినిగిపోయి దర్శనం ఇస్తుండంతో అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. అధికారుల నిర్లక్షానికి పరాకాష్టగా మారింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న బోర్డుకు ఎమ్మెల్యే ముఖ చిత్రాన్ని దాచిపెట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, ఏప్రిల్ 25: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో గురువారం సికింద్రాబాద్‌కు చెందిన లక్ష్మీ గణపతి కల్చరల్ ఆర్గనైజేస్ బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. మహాగణపతిం, హరిహర గజముఖ, గేశ పంచతంత్రం, బో..శంభో, శివాష్టకం తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలం, ఏప్రిల్ 25: శ్రీశైలం మహాక్షేత్రంలో గురువారం మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోని దత్తాత్రేయ స్వామికి విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహా గణపతి పూజలు చేసి, అనంతరం దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకం, విశేష పూజలు జరిపారు.

నామినేషన్ల పర్వంలో చివరి రోజు

నందికొట్కూరు, ఏప్రిల్ 25: నందికొట్కూరు నియోజకవర్గంలో నామినేషన్ల పర్వం ముగిసింది. మొత్తం 28 మంది 47 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య, వైసీపీ అభ్యర్థి ధార సుధీర్, కాంగ్రెస్ అభ్యర్థి తోగూరు ఆర్థర్, బీఎస్పీ తరపున గడ్డల లాజర్, జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ తరుపు కె.వెంటేశ్వర్లు, ఇండియా ప్రజాబంద్ పార్టీ తరపున పల్లె నాగరాజు, టీడీపీ తరపున బండి జయరాజు, డా.కాకరవాడ చిన్న వెంకటస్వామి నామినేషన్లు వేశారు. అలాగే స్వతంత్ర అభ్యర్థి బాలరాజు(పారుమంచాల) జై భారత్ పార్టీ అభ్యర్థిగా బోరెల్లి వెంకటరాముడు, వైసీపీకి చెందిన కాటం వెంకటరమణ, భారత చైతన్య యువజన పార్టీకి చెందిన చిన్న వెంకటరమణ, సోషల్ డెమోక్రటిక్ పార్టీఆఫ్ ఇండియాకు చెందిన షాబోలు లింకన్ రాజు, ఇండియన్ నేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి టి.నాగరాజు, స్వతంత్ర అభ్యర్థిగా నాగలింగం, స్వతంత్ర అభ్యర్థిగా బోరెల్లి నిర్మల, కాంగ్రెస్ తరపున తోగూరు వివేక్ జయ సందీప్, లిబర్టియన్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎస్. మునయ్య, స్వతంత్ర అభ్యర్థిగా గాదె సుధీర్, ఆంధ్రరాష్ట్ర ప్రజాసమితి పార్టీ అభ్యర్థిగా పూల హరిబాబు, ఇండియన్ నేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున పి.శ్రీరాములు, ఎం.నాగలింగం, సమాజ్‌వాది పార్టీ తరపున నక్కా రాజేష్, స్వతంత్ర అభ్యర్థిగా పి.శ్రీనివాసులు, అన్నా వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి ఎస్.వెంకటేశ్వర్లు, స్వతంత్ర అభ్యర్థిగా గండి సంజీవుడు, సూపర్ రేంజర్స్ పార్టీ తరుపున కరుణాకర్, ప్రజా ఏక్తా పార్టీ తరపున పెరుమాళ్ల మధు, భారత యువజన చైతన్య పార్టీ తరపున చిమ్మే వెంకటరమణ నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నామినేషన్‌లను అన్నింటిని నేడు పరిశీలించి అర్హత జాబితాను ప్రకటిస్తారు. ఈనెల 29వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ చివరి గడువు.

ఆత్మకూరురూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శ్రీశైలం నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ ప్రక్రియలో భాగంగా చివరి రోజైన గురువారం 15 నామినేషన్లు దాఖలైనట్లు శ్రీశైలం నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి సుధారాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బుడ్డా శైలజ నామినేషన్ పత్రాలను సమర్పించినట్లు చెప్పారు. అదేవిధంగా వైసీపీ తరపున శిల్పా కార్తీక్ రెడ్డి (రెండవ సెట్), వైసీపీ అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి తరపున విజయ్‌చౌదరి (4వ సెట్)లు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ తరపున చింతా నాగేశ్వరరావు, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి సికిందర్ బాషా తరపున వెంకటరామయ్య, బీఎస్పీ తరపున పల్లె చంద్రశేఖర్ (రెండవ సెట్), జాతీయ జనసేన పార్టీ తరపున జయనారపు రెడ్డి, జైభీమ్‌రావు పార్టీ తరపున మేడిగా సుస్మిత, జైహిందుస్థాన్ పార్టీ తరపున ఎల్లంపల్లి లోకేశ్వరరరెడ్డి, కాంగ్రెస్ తరపున అసర్ సయ్యద్ ఇస్మాయిల్, నేషనల్ మహాసభ పార్టీ తరపున గుండ్ల మల్లికార్జున (రెండవ సెట్), ఎస్డీపీఐ పార్టీ తరపున మహబూబ్ బాషా నామినేషన్లు దాఖలు చేశారు. ఇదిలా ఉంటే ఇండిపెండెంట్ అభ్యర్థులుగా జనవత్ నాగస్వామి, తిమ్మయ్య, కాటిపోగు రాజమ్మలు నామినేషన్లను దాఖలు చేసినట్లు తెలిపారు. కాగా ఇప్పటివరకు మొత్తం 32 నామినేషన్లు దాఖలైనట్లు ఆమె తెలిపారు. ఇదిలావుంటే నామినేషన్ ప్రక్రియ వద్ద పోలీసులు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్వో కార్యాలయానికి 100మీటర్ల వరకు 144సెక్షన్ విధించారు.

అవుకులో వైసీపీకి భారీ షాక్

కాటసాని ముఖ్య అనుచరుడు టీడీపీలో చేరిక

అవుకు, ఏప్రిల్ 25: అవుకులో వైసీపీకి భారీ షాక్ తగిలింది. అవుకు పట్టణానికి చెందిన కాటసాని రామిరెడ్డి ముఖ్య అనుచరుడు వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిన మద్దిలేటి గౌడ్ బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. గురువారం బీసీ జనార్దన్‌రెడ్డి, ఐవీ ఫక్కీరారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి, మోట్లరామిరెడ్డి, కాట్రెడ్డి మల్లిఖార్జునరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి అవుకులోని మద్దిలేటి గౌడ్ ఇంటికి చేరుకొని చర్చలు జరిపారు. అనంతరం బీసీ జనార్దన్‌రెడ్డి మద్దిలేటిగౌడ్‌కు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా మద్దిలేటిగౌడ్ మాట్లాడుతూ కాటసాని రామిరెడ్డి వెంట 35 ఏళ్ల పాటు ఉన్నామని, అయినా వైసీపీలో గుర్తింపు లేదని అన్నారు. కాటసాని రామిరెడ్డి బనగానపల్లె నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారన్నారు. బీసీ సేవా కార్యక్రమాలు, గతంలో చేసిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని టీడీపీలో చేరినట్లు తెలిపారు. అలాగే అవుకు టీడీపీ కార్యాలయంలో వైసీపీ మహిళానాయకురాలు వెంకటలక్ష్మమ్మ, వెంకప్పగారి అప్పయ్య, మారు రమణ, తిప్పన్న, తదితర కుటుంబాలు వైసీపిని వీడి టీడీపీలో చేరారు. మార్కెట్ వీధికి చెందిన పెద్ద కుళాయప్ప, చిన్నకుళాయప్ప, దాదిపుల్లయ్య, దాది శ్రీను, వెంకటేశ్వర్లు, గొడుగు పుల్లయ్య, వెంకటేశ్వర్లు, మహానంది, లక్ష్మయ్య, రాజ్‌కుమార్, గోవిందరాజు, తదితర 40 కుటుంబాలు టీడీపీలో చేరారు. అలాగే చల్లా విజయభాస్కర్‌రెడ్డి ఇంటి వద్ద మెటికల రామచంద్రుడు, దొర్నిపాడు నారాయణ, రామస్వామి, గుర్రాల వెంకటరాముడు, కొత్తపల్లె వెంకటరాముడు, కిట్టు, రమణ, రామచంద్రయ్య, బలరామయ్య, తదితర కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరమణనాయక్, దంతెల రమణ, తిక్కన్న, నారపురెడ్డి, శివరామిరెడ్డి, బాలనాగిరెడ్డి పాల్గొన్నారు.

టంగుటూరులో..

బనగానపల్లె: బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన వైసీపీ మద్దతుదారులు వంగల మహీపాల్‌రెడ్డి, హరీశ్‌కుమార్‌రెడ్డి, హుసేనయ్య, కంబయ్య, చెంచప్ప, చిన్నకాశీం, పెద్ద ఖాశీం, దస్తగిరి, దుప్పన్న, ఆనీఫ్, మధు, చాకలి పుల్లయ్య తదితర కుటుంబాలు టీడీపీలో చేరారు. అలాగే కొలిమిగుండ్ల మండలం కోరు మానుపల్లె గ్రామానికి చెందిన సుంకర సుదర్శన్‌బాబు, గోవిందు భజ గోవిం దు, గురుపాలు, చిన్నరమణ, పెద్దగోవిందు, చిన్నగోవిందు, పెద్దరమణ టీడీపీ లో చేరారు. అలాగే అవుకు మండలం సంగపట్నంకు చెందిన 40 వైసీపీ కుటుంబాలు గురువారం టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో తప్పెట చిన్నరాముడు, గుర్రాల బాషా, రాముడు, రాజు, కంబగిరి, రామసుబ్బయ్య, బాలోబులేసు, చిన్నకం బగిరి, ఓబులేసు, రాముడు, బాలయ్య ఉన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని కొండపేటలో బీసీ ఇంటింటి ప్రచారం చేసి సూపర్ 6 పథకాలను గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిన మద్దిలేటిగౌడ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

పెట్నికోటలో...

కొలిమిగుండ్ల రూరల్: కొలిమిగుండ్ల మండలం పెట్నికోటలో కర్నూలు జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సొంత పంచాయతీలో కొలుకోలేని దెబ్బ తగిలింది. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కొప్పుల వెంకట శివారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, పెద్ద రామిరెడ్డి, చ్రందశేఖరరెడ్డి, వెంకటరా మిరెడ్డి, శివశంకరరెడ్డి, భాస్కరరెడ్డి, కుమ్మెత రామిరెడ్డి, కుమ్మెత చ్రందశేఖరరెడ్డి, నంద్యాల వెంకటరామిరెడ్డి, చంద్రపకాశ్‌రెడ్డి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దనరెడ్డి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీసీ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి అండగా ఉండటంతోపాటు, సముచిత స్థానం కల్పిస్తామన్నారు.





మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ వర్గీయులు

వైసీపీని ఇంటికి పంపండి

డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



ఆర్ఎస్ రంగాపురంలో ప్రజలకు అభివాదం చేస్తున్న కోట్ల

బేతంచెర్ల, ఏప్రిల్ 25: రాష్ట్రంలో ఐదేళ్లుగా రాక్షస పాలన సాగిస్తున్న వైసీపీని ఇంటికి సాగనంపాలని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా మద్దిలేటి స్వామి ఆలయ ముఖద్వారం ముందు ఆయనకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ గజమాలతో స్వాగతం పలికారు. రంగాపురం పురవీధుల గుండా ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన, దౌర్జన్యాలు, ఇసుక దందా, మద్యం మాఫియా వంటి అరాచకాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. రైతులకు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. రైతుల ఖాతాల్లో పైసా కూడా జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీని ప్రజలు క్షమించరు

మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

డోన్, ఏప్రిల్ 25: ఐదేళ్లుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన వైసీపీని ప్రజలు క్షమించరని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. గురువారం మండలంలోని కామగానిగుంట్ల, సోంపురం గ్రామా ల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచమని వైఎస్ జగన్మోహన్ రెడ్డి గత ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి విజయ భట్టు, శ్రీనివాసులు యాదవ్, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, రంజిత్ కిరణ్, గోవిందరెడ్డి, బాలు, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

'పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, ఏప్రిల్ 25: పశువులకు వచ్చే వ్యాధులతో పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి సాయిబాబా సూచించారు. గురువారం ముత్యాలపాడు పశువైద్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉండటంతో పశువులకు వడదెబ్బ సోకే ప్రమాదం ఉందన్నారు. రైతులు మూగ జీవాలను అధిక భాగం నీడనిచ్చే ప్రదేశాల్లో ఉంచాలని సూచించారు. వడదెబ్బ సోకిన వెంటనే వైద్య చికిత్సలు చేయించాలన్నారు. పశు బీమా తప్పనిసరిగా చేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఉన్నారు.

రేపు బండలాగుడు పోటీలు

చాగలమర్రి, ఏప్రిల్ 25: మండలంలోని చింతలచెరువు గ్రామంలో గంగ జాతర సందర్భంగా శనివారం రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ మొదటి తొమ్మిది నగదు బహుమతులు వరుసగా రూ.50,016, రూ.35,016, రూ.25,016, రూ.15,016, రూ.10,016, రూ.8,016, రూ.6,016, రూ.4,016, రూ.2,016 అందజేయనున్నట్లు తెలిపారు. ఎద్దుల యజమానులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే గంగ జాతర సందర్భంగా ట్రాక్టర్ రివర్స్ పందెం పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.2,016, రెండో బహుమతి రూ.1,016 నగదు అందజేస్తామని చెప్పారు.

వైసీపీని ఓడించాలి: కాంగ్రెస్



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు

డోన్(రూరల్), ఏప్రిల్ 25: రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన కొనసాగిస్తున్న వైసీపీని ప్రజలు ఓడించాలని కాంగ్రెస్ నంద్యాల పార్లమెంటు ఎంపీ అభ్యర్థి జే.లక్ష్మీనరసింహ యాదవ్, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి గార్లపాటి మద్దిలేటి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తున్నదని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రక్షణ లేదని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాల భర్తీలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పులిశేఖర్, సీపీఎం పట్టణ మండల అధ్యక్షుడు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు జనార్దన్ యాదవ్, శేఖర్ యాదవ్, వడ్డె రాజశేఖర్, జీవన్, గోపీనాథరావు, ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకులు తెలుగు విజయకుమార్, ఏఐటీయూసీ నాయకులు అబ్బాస్ పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎంపీడీవో సాయికృష్ణ సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మే 13న పోలింగ్ ఉంటుందని, ఓటర్లు సకాలంలో పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్ళి ఓటు హక్కు ఉపయోగించుకోవాలన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 25: వేసవిలో ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని కొలిమిగుండ్ల ఎంపీడీవో సా్రయికిష్ణ బుధవారం సూచించారు. మండలంలోని గ్రామాల్లో తాగునీటి కొరత ఏర్పడుతోందన్నారు. ఉన్న నీటిని ప్రజలు పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు.

రైతుల సమస్యలను గాలికి వదిలిన వైసీపీ: కాటసాని

బనగానపల్లె, ఏప్రిల్ 25: వైసీపీ రైతుల సమస్యలను గాలికొదిలేసిన అసమర్థ ప్రభుత్వమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం అవుకు మండలంలోని నిచ్చెనమెట్ల, లింగంబోడు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి విస్తృత ప్రచారం చేశారు. కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి ప్రజాగళంలో మాట్లాడుతూ రైతులు కరువు కాటకాలతో అల్లాడుతున్నా కనీసం వారికి సాయం అందించలేదన్నారు. అలాగే సమయానికి సాగునీరు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. దద్దనాల ప్రాజెక్టుకు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని పంపింగ్ చేయకపోవడంతో ఇబ్బందిపడుతున్నా సీఎం జగన్ పట్టించుకున్న పాపానపోలేదన్నారు. నిరుద్యోగులను సీఎం నిండా ముంచారన్నారు. దళితులపై, మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరిగాయన్నారు. టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారన్నారు. వైసీపీ అవినీతి ప్రభుత్వాన్ని ఇంటికి పంపి బీసీ జనార్దనరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డితో పాటు టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.



నిచ్చెనమెట్లలో ప్రచారం చేస్తున్న కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి

సాయిబాబాకు క్షీరాభిషేకం



సాయిబాబాకు పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, ఏప్రిల్ 25: మండలంలోని మూడురాళ్లపల్లె, చాగలమర్రి గ్రామాల్లోని సాయిబాబా ఆలయంలో గురువారం వేద పండితుల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం, రుద్రాభిషేకం పూజలు నిర్వహించారు. మహిళలు ప్రత్యేక హారతులు ఇచ్చి పూజలు చేశారు. పల్లకీ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని చందలూరు, రుద్రవరం గ్రామాల్లో గురువారం సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. చందలూరు గ్రామంలో విగ్రహానికి అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. రుద్రవరంలో సాయినాథుడి చిత్రపటాన్ని పూలతో అలంకరించారు. భక్తులు సాయినాథుడిని దర్శించుకున్నారు.

'మలేరియా నివారణ అందరి బాధ్యత'

శిరివెళ్ల, ఏప్రిల్ 25 : దోమకాటు వల్ల వచ్చే మలేరియా వ్యాధిని నివారించడం అందరి బాధ్యత అని శిరివెళ్ల పీహెచ్‌సీ వైద్యుడు ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మలేరియా దినోత్సవంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలు దోమలను నివారించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే మలేరియా సోకకుండా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సరస్వతి, సూపర్‌వైజర్లు రవి కిషోర్, అమినాబీ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బేతంచెర్ల: మలేరియా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్ఎస్ రంగాపురం పీహెచ్‌సీ డాక్టర్ అబ్దుల్ హలీం సూచించారు. గురువారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం పీహెచ్‌సీలో ప్రపంచ మలేరి యా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, ఎంపీహెచ్‌ఈవో లాల్ రెడ్డి, అబ్దుల్ గఫార్, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

శేష వాహనంపై ఊరేగిన చెన్నకేశవస్వామి

బేతంచెర్ల, ఏప్రిల్ 25: పట్టణంలోని గౌరిపేటలో అంజనేయ స్వామి ఆలయంలో వెలసిన చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారిని శేష వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో మద్దిలేటి, బుగ్గన విశ్వనాథరెడ్డి, పుల్లారెడ్డి, మారుతి కృష్ణశర్మ భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థిగా మద్దిలేటి నామినేషన్

డోన్(రూరల్), ఏప్రిల్ 25: డోన్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా గార్లపాటి మద్దిలేటి గురువారం మధ్యాహ్నం నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంటు అభ్యర్థి లక్ష్మీనరసింహ యాదవ్‌తో కలిసి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పులిశేఖర్, కాంగ్రెస్ నాయకులు జనార్దన్ యాదవ్, శేఖర్ యాదవ్, సుబ్బు యాదవ్, వడ్డె రాజశేఖర్, గోపీనాథరావు, తెలుగు విజయకుమార్ పాల్గొన్నారు.

ఆర్వో కార్యాలయం పరిశీలన

డోన్(రూరల్), ఏప్రిల్ 25: సాధారణ ఎన్నికల్లో భాగంగా గురువారం డోన్‌లో పోలీస్ అబ్జర్వర్ ఐపీఎస్ అధికారి హిమాన్షు త్రివేది రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు సంబంధించిన సమ స్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచనలు చేశారు.

'టీడీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి'

రుద్రవరం, ఏప్రిల్ 25: జిల్లాలో టీడీపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దామోదరం నరసింహులు, ప్రధాన కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు, తెలుగు యువత ఉపాధ్యక్షుడు మెట్ల భాస్కర్ అన్నారు. మండలంలోని తిప్పారెడ్డిపల్లె గ్రామంలో గురువారం ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియను కలిశారు.

నందవరం ఆలయ హుండీ లెక్కింపు



హుండీ నగదు లెక్కిస్తున్న భక్తులు

బనగానపల్లెరూరల్, ఏప్రిల్ 25: నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు భక్తుల సమక్షంలో ఆలయ ఈవో కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. రూ.17,73,769 నగదు, 14 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి ఆదాయం లభించినట్లు తెలిపారు. అన్నదాయం హుండీ ఆదాయం రూ.60,937 ఆదాయం లభించినట్లు తెలిపారు. పర్యవేక్షణ అధికారి పీ. హరిశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

బేతంచెర్ల, ఏప్రిల్ 25: మండలంలోని కొలుములపల్లె గ్రామానికి చెందిన టీడీపీ మాజీ ఎంపీటీసీ సభ్యులు, టీడీపీ మండల సమన్వయకర్త ఉన్నం చంద్రశేఖర్ తల్లి నారాయణమ్మ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, డోన్ టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, తిరుమలేష్ చౌదరి తదితరులు చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతురాలి భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టీడీపీలోకి మాజీ సర్పంచ్

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 25: మండలంలోని బి. ఉప్పలూరు మాజీ సర్పంచ్ నాగేంద్ర గురువారం సాయంత్రం తెలుగు దేశం పార్టీలో చేరారు. టీడీపీ సీనియర్ నేత ఐవీ ఫక్కీరారెడ్డి సమక్షంలో కొలిమిగుండ్లలో నాగేంద్రతోపాటు బి. తాడిపత్రి, ఉప్పలూరు, నాగిశెట్టిపల్లె గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాదిగ రాముడు, తిరుపాలు, ఓబులయ్య, లక్ష్మీరాముడు, గోవిందు, వెంకటయ్య, దస్తగిరి, శీను తదితర 50 మంది కార్యకర్తలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు.

గడ్డివాముల దగ్ధం

రుద్రవరం, ఏప్రిల్ 25: మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గురువారం నాలుగు గడ్డివాములు దగ్ధమయ్యాయి. నారాయణ, బాలనాగి, అంజన్న, పాములేటి అనే వ్యక్తులకు చెందిన గడ్డివాములు దగ్ధమైనట్లు ఫైర్ ఆఫీసరు వీరారెడ్డి తెలిపారు. ఆళ్లగడ్డ అగ్నిమాపక సిబ్బంది గ్రామనికి చేరుకుని మంటలు అదుపు చేశారు. సుమారు రూ.2లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

ఆళ్లగడ్డలో రాక్షస పాలన: అఖిలప్రియ

రుద్రవరం, ఏప్రిల్ 25: ఆళ్లగడ్డలో రాక్షస పాలన కొనసాగుతోందని టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ ఆరోపించారు. మండలంలోని ముత్తలూరు, నరసాపురం, తిప్పారెడ్డిపల్లె, టి.లింగందిన్నె, నాగులవరం, రుద్రవరం గ్రామాల్లో గురువారం ప్రజాగళం యాత్రలో పాల్గొన్నారు. అఖిలప్రియ మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు పెంచి ప్రజలకు అప్పుల్లో నెట్టివేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి ఒక రౌడీని ఏర్పాటు చేశారని విమర్శించారు. రైతులకు నీరు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. కార్యక్రమంలో రంగనాయకులు, గురుమూర్తి, నారాయణ, రాజారావు, చిన్నిక్రిష్ణ, మనోహర్‌రెడ్డి, ఫక్కీరయ్యగౌడ్, సర్పంచ్ శాంతకుమారి, నాగేశ్వర్‌రెడ్డి, పార్థసారధిరెడ్డి, పెద్దఫక్కీరా, శ్రీనివాసులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'టీడీపీ గెలుపు తథ్యం'

దొర్నిపాడు, ఏప్రిల్ 25: వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు తథ్యమని ఆ పార్టీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. మండలంలోని చాకరాజువేముల, బుర్రారెడ్డిపల్లె, దొర్నిపాడు గ్రామాల్లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. జగత్ విఖ్యాతరెడ్డి మాట్లాడుతూ విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని అన్నారు. టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. టీడీపీ నాయకులు మల్లేశ్వరచౌదరి, వెంకట్‌నాయుడు, గోపాల్‌నాయుడు, రమణయ్య, హబీబ్‌బాషా, ప్రతాప్, శ్రీనివాసరావు, వెంకటసుబ్బయ్య ఉన్నారు.

రెండేళ్లుగా మూతబడిన వాటర్ ప్లాంట్

కుమ్ములాటతో తాళం మీద తాళం వేసిన వైసీపీ నాయకులు



ప్రభుత్వ మినరల్ వాటర్ ప్లాంట్‌కు తాళం వేసిన వైసీపీ నాయకులు

కోవెలకుంట్ల, ఏప్రిల్ 25: వైసీపీ నాయకుల కుమ్ములాటతో ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాల్సిన మినరల్ వాటర్ ప్లాంట్ రెండేళ్ల నుంచి మూతపడింది. కోవెలకుంట్ల మండలం బిజనవేముల గ్రామ నడిబొడ్డన మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మించారు. దీని నుంచి అమడాల, బిజనవేముల, వెలగటూరు గ్రామాలకు స్వచ్ఛమైన నీరు సరఫరా అయ్యేది. అయితే వైసీపీ నాయకుల కుమ్ములాటతో ఇది ప్లాంట్ మూతపడింది. అధికారులు కూడా వైసీపీ నాయకుల వత్తిళ్లకు లొంగి పట్టించుకోకపోవడంతో నేటికీ ఈ వాటర్‌ప్లాంట్ తెరచుకోలేదు. వైసీపీలో ఓ వర్గం గ్రామ సర్పంచ్ కావడంతో అధికారుల అండదండలతో మినరల్ వాటర్‌ప్లాంట్‌కు తాళం వేయించారు. గ్రామానికి చెందిన మరో వైసీపీ నాయకుడు కూడా ప్లాంట్ నీరు ఎవరూ వాడుకోరాదని మరో తాళం వేశాడు. సర్పంచ్ ఎన్నికలు అనంతరం రెండు నెలలకే వైసీపీ నేతల కుమ్ములాటతో మూతపడిన ప్లాంట్ ఇప్పటికీ తెరుచుకోలేదు. ఈ విషయాన్ని గ్రామస్థులు స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారు లకు, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కారం కాలేదు.

జేఈఈ-మెయిన్స్‌లో శ్రీసుధ విద్యార్థుల ప్రతిభ



ర్యాంకులు సాధించిన విద్యార్థులు

డోన్(రూరల్), ఏప్రిల్ 25: జేఈఈ-మెయిన్స్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో డోన్ శ్రీసుధ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కళాశాలకు చెందిన విద్యా ర్థులు ఏ.విశ్వజిత్ 1440వ ర్యాంకు, సాయినాథ్ రెడ్డి 4054, వినోద్ 8643, రంగనాథ్ రెడ్డి 9505, ఈశ్వర్ ప్రసాద్ 12145, హర్షవర్దన్ రెడ్డి 19508, విజయ్ 24458, గౌతమ్ రెడ్డి 30186, ఎం.కీర్తి 36864, వెంకట వంశీధర్ 41690, వై.మౌ నిక 44653 ఆలిండియా స్థాయిలో ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ యోగానందరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

చంద్రబాబును కలిసిన సుబ్బారెడ్డి



చంద్రబాబుతో ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, ఏప్రిల్ 25: ఉమ్మడి కడప జిల్లాలోని రాజంపేటలో ఎన్నికల ప్రచారంలో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబును గురువారం రాత్రి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి కలిసారు. చంద్రబాబు పిలుపు మేరకు డోన్ నుంచి సుబ్బారెడ్డి రాజంపేటకు వెళ్లి కలిసారు. డోన్ నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులపై చంద్రబాబు చర్చించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో టీడీపీ గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని సుబ్బారెడ్డికి సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పనిసరిగ్గా మంచి గౌరవం కల్పిస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

'ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించండి'

నంద్యాల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు కట్టు దిట్టమైన చర్యలు తీసుకొని ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడాలని కర్నూలు రేంజి డీఐజీ సీహెచ్ విజయరామారావు పోలీసు అధికారులను ఆదేశించారు. ఆళ్లగడ్డ డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఎన్నికల పోలీస్ ప్రత్యేక అధికారి హిమాన్స్ శంకర్ త్రివేది సమక్షంలో ఆళ్లగడ్డ, బనగానపల్లె నియోజకవర్గాల పోలీసు అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఆళ్లగడ్డ పట్టణంలో సమస్యాత్మక పోలింగు స్టేషన్లను, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. ఎన్నికల్లో గొడవలు, అల్లర్లు జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ర్యాలీలు, మీటింగులలో శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లఘించిన వారిపై నమోదు చేసిన కేసుల వివరాలను, సమస్యాత్మక గ్రామాల్లో శాంతిభద్రలకు విఘాతం కల్గకుండా తీసుకున్న చర్యల వివరాలను, పోలీసు కవాతు వివరాలను, ఎంతమందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారన్న వివరాలను సమీక్షా సమావేశంలో చర్చించారు. నంద్యాల ఎస్పీ రఘు వీర్‌రెడ్డి, ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్, సీఐలు రమేష్‌బాబు, హనుమంతనాయక్, ఎస్ఐలు ఉన్నారు.



మాట్లాడుతున్న కర్నూలు రేంజీ డీఐజీ